తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
బుధవారం
16 సెప్టెంబర్ 2026
పేజీలు : 8

## యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణ పనులను
# నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి : కలెక్టర్



- క్షేత్రస్థాయి పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించాలి.
- సుల్తానాబాద్‌లో అదనపు తరగతి గదులను రెండు నెలల్లోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి
- ఎస్ఐఆర్ విచారణను మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలి
- నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలి
- ఓటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలి
- ర్యాకల్ దేవ్‌పల్లి, సుల్తానాబాద్‌లో పాఠశాలలు, ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ఎలిగేడు,సుల్తానాబాద్,సెప్టెంబర్ 15(జనంసాక్షి) :** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఎలిగేడు మండలం ర్యాకల్ దేవ్‌పల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను, సుల్తానాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సుల్తానాబాద్ 5వ వార్డులోని శ్రీ వాణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా పాఠశాల పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ర్యాకల్ దేవ్‌పల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. నిర్ణీత కాలపరిమితికి అనుగుణంగా పనులు పూర్తి చేసేలా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు.

**- అదనపు తరగతి గదులను రెండు నెలల్లో పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్.**

సుల్తానాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను లిరెండు నెలల వ్యవధిలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావా లనిలి అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు సకాలంలో అందేలా పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.



**- ఎస్ఐఆర్ విచారణను మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలి**

సుల్తానాబాద్ 5వ వార్డులోని శ్రీ వాణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఐఆర్ విచారణను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు సంబంధించిన ఆధార పత్రాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, సమర్పించిన ప్రతి పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

**- ఓటర్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి :**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు సంబంధించిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన సమాచారం అందించి, సంబంధిత పత్రాలను పరిశీలించిన అనంతరం సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో పూర్తి ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఈ,ఈ అశోక్ కుమార్, తహసీల్దార్ లు యాకన్న, బషీరోద్దీన్,డిప్యూటీ ఈ,ఈ బాబు రెడ్డి, మారుతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో అభివృద్ధి పనులకు రూ.5 కోట్ల నిధులు మంజూరు
### ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 జనంసాక్షి**

నిజామాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి మరియు మరమ్మతు పనుల కోసం ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.ఈ సందర్భంగా వివిధ డివిజన్లకు చెందిన 46 మంది అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.32 లక్షల విలువైన చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

**మంజూరైన నిధుల వివరాలు:**

రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతులు: పర్యాటక శాఖ ద్వారా రూ.50 లక్షలు మంజూరయ్యాయి.

ఆర్మూర్ ప్రాంతం: అతిథి గృహం మరమ్మతులు, సిద్ధులగుట్ట కాటేజీ మరియు అతిథి గృహం నిర్మాణాలకు రూ.50 లక్షలు కేటాయించారు. భీమ్‌గల్ ఆలయ అభివృద్ధి: ప్రసిద్ధ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ.4 కోట్లు మంజూరయ్యాయి.ఈ నిధుల సాధనలో తనతో పాటు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కూడా ప్రత్యేకంగా కృషి చేశామని షబ్బీర్ అలీ తెలిపారు. ఈ మేరకు నిధులు మంజూరు చేసిన పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, సహకరించిన ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, పలువురు కార్పొరేటర్లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మావోయిస్టు సీనియర్ అండర్ గ్రౌండ్ క్యాడర్ అధినేత లొంగుబాటు
### కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య వెల్లడి




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 జనంసాక్షి:**

మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మావోయిస్ట్ పార్టీకి చెందిన సీనియర్ అండర్‌గ్రౌండ్ క్యాడర్ లొంగుబాటు వివరాలను ఆయన అధికారికంగా వెల్లడించారు.

**మావోయిస్ట్ నేత లొంగుబాటు**

బోధన్ మండలం శక్కర్‌నగర్‌కు చెందిన సీనియర్ మావోయిస్ట్ నేత నక్క సుశీల రాణి (అలియాస్ లత) ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు పార్టీని వీడి, సీపీ సమక్షంలో స్వచ్ఛందంగా జనజీవన స్రవంతిలోకి ప్రవేశించారు.

**సుదీర్ఘ ప్రస్థానం.**

గత 34 సంవత్సరాలుగా అజ్ఞాతంలో కొనసాగిన సుశీల రాణి, గతంలో టెక్నికల్ డిపార్ట్‌మెంట్, క్రాంతి ప్రెస్, మొబైల్ స్కూల్ బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు, ఛత్తీస్‌గఢ్ మాడ్ డివిజన్‌లో విద్యా, రాజకీయ శిక్షణా తరగతుల బాధ్యతలు నిర్వహించారని సీపీ తెలిపారు.

**ఆరోగ్య సమస్యల కారణంగానే..**

1998లో జరిగిన ఎదురుకాల్పుల్లో తీవ్ర గాయాల పాలవడం, అనారోగ్య సమస్యలు తలెత్తడంతోనే ఆమె లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు

**ప్రభుత్వ పునరావాసం అందజేత**

తెలంగాణ ప్రభుత్వ పునరావాస విధానంలో భాగంగా ఆమెకు రూ. 5,00,000 రివార్డు చెక్కు, తక్షణ ఖర్చుల నిమిత్తం రూ. 25,000 అందజేసినట్లు సీపీ తెలిపారు. త్వరలోనే ప్రత్యేక హెల్త్ కార్డ్ కూడా జారీ చేయనున్నట్లు చెప్పారు.

**మావోయిస్ట్ ఉనికి తుది దశకు**

రాష్ట్రంలో పోలీసుల పటిష్ట నిఘా, గ్రేహౌండ్స్ దళాల చర్యలు మరియు పునరావాస

వార్తా లోపలి పేజీలో

# కొలువుదీరిన గణనాథులు



**సదాశివనగర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):**విఘ్నాలను తొలగించి సుఖసంతోషాలు ప్రసాదించే ఆది దేవుడు శ్రీ గణేశుడి నవరాత్రి ఉత్సవాలు సదాశివనగర్ మండలంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలం లోని వివిధ గ్రామాల్లో యువజన సంఘాలు, గణేష్ ఉత్సవ కమిటీలు, భక్తులు ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి గణనాథులను ప్రతిష్ఠించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారుగణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తి భావంతో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.మండలంలోని ప్రతి గ్రామంలో 'గణపతి బప్పా మోరియా' నినాదాలు మార్మోగుతుండగా, గణనాథుల దర్శనానికి భక్తులు తరలివస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి



**సదాశివనగర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):**సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డబ్బులు పణంగా పెట్టి పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు. సదాశివనగర్ ఎస్ఐ పుష్పరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్సై ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి సంతోష్‌రెడ్డి పౌల్ట్రీ ఫామ్‌పై సోమవారం దాడి నిర్వహించారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,080 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.జూదానికి దూరంగా ఉండాలి ఈ సందర్భంగా ఎస్ఐ పుష్పరాజు మాట్లాడుతూ.. జూదం చట్టరీత్యా నేరమని, ప్రజలు జూదానికి దూరంగా ఉండాలని సూచించారు. జూదానికి సమయాన్ని, డబ్బును వృథా చేయకుండా పిల్లల బంగారు భవిష్యత్తుపై దృష్టి సారించాలని అన్నారు. కుటుంబ భవిష్యత్తుకు పునాది వేసేందుకు విలువైన సమయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.మండలంలో ఎక్కడైనా జూదం, పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూదానికి తావు లేదని, జూదానికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఖాసీంపేట ప్రభుత్వ పాఠశాలలో యూనిఫామ్ పంపిణీ

**గన్నేరువరం, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):**గన్నేరువరం మండలంలోని ఖాసీంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత స్కూల్ యూనిఫాంల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ కర్నే చంద్రయ్య, ఉప సర్పంచ్ సందవేణి ఐలయ్య హాజరై విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలను అందించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత యూనిఫాం పథకం ద్వారా పేద విద్యార్థులకు ఎంతో లబ్ది చేకూరుతుందని, విద్యార్థులంతా యూనిఫాం ధరించి పాఠశాలకు హాజరు కావాలని సర్పంచ్ కర్నే చంద్రయ్య సూచించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్, భాగ్య,ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌లో సత్యశోధక్ విద్యార్థుల సత్తా

**సిరికొండ సెప్టెంబర్ 15(జనం సాక్షి ): తెలంగాణ** సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని తిలక్ స్టేడియంలో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర సబ్‌జూనియర్ అంతర జిల్లా సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ (అండర్--15) బాలుర విభాగం పోటీల్లో సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టుకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన అజయ్, హర్షిత్, శ్రీకాంత్, సాయితేజ ప్రాతినిధ్యం వహించారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులు జట్టు విజయానికి కీలకంగా నిలిచారు. వారి ప్రతిభతో నిజామాబాద్ జిల్లా జట్టు ద్వితీయ స్థానం (రన్నర్స్‌అప్) సాధించింది.రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి పాఠశాలకు, జిల్లాకు గుర్తింపు తీసుకు వచ్చిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మెడల్స్ అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ



విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల సమగ్ర వికాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవి శ్వాసం, జట్టుగా పనిచేసే లక్షణాలు పెంపొం దుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థులు ఇదే క్రీడాస్ఫూర్తి, పట్టుదలతో ముందుకు సాగుతూ భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిం చారు. విద్యార్థుల విజయంపై పాఠశాల ఉపాధ్యా యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# బహుజనుల దేవుడు అంబేద్కర్

**ముస్తాబాద్ సెప్టెంబర్ 15 (జనం సాక్షి)**హమారా ప్రసాద్ అలియాస్ నాగుల వరప్రసాద్ రావు అనే వ్యక్తి ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత బహుజనుల దిక్సూచి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర పై కల్పిత నాయకుడు అనే పుస్తకాన్ని రాశానని ప్రింట్ కూడా అవుతుందని వివిధ ఛానల్లో చూస్తున్నాం. ఈ విషయం పై ముస్తాబాద్ మండల అంబేద్కర్ సంఘాల నాయకులు స్పందించారు.చుంచు మల్లన్న మాట్లాడుతూ అంబేద్కర్ పై అసత్య ప్రచారాలతో కల్పించి రాస్తే మాత్రం తాటతీస్తామని హెచ్చరించారు.అసలు చదువు రాని హమారాప్రసాద్ అంబేద్కర్ చరిత్ర పై పుస్తకం రాయడం ఏంటని మాకు ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు.ఇతని వెనుక అంబేద్కర్ అంటే ఈర్ష్య,ద్వేషం కలిగిన మనుధర్మ భావజాలం కలిగిన వ్యక్తులు దాగి ఉన్నారని ఆరోపించారు.కేవలం హమారా ప్రసాద్ బలి పశువు మాత్రమే నని, రాజ్యాంగాన్ని మార్చేందుకే ఈ కుట్రలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. బహుజన కులాలు ఏకమై అంబేద్కర్ చరిత్రను కల్పించి రాయకుండా అడ్డుకోవాలని



పిలుపునిచ్చారు. రాజ్యాంగం రాసిన అంబేద్కర్ ను కల్పిత నాయకుడు అంటే దేశాన్ని కూడా కల్పిత దేశమని అవమానించినట్లు అవుతుందన్నారు .వెంటనే అతని దేశద్రోహం కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.వేల ఏళ్లుగా ఎన్నో అవమానాలు ,కష్టాలు చూశామని మా తల్లిదండ్రుల వరకు కూడా చదువుకోలేదన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చాకే బహుజన కులాలు సమాజంలో ఇప్పుడిప్పుడే రాజకీయంగా ,విద్యాపరంగా తలెత్తు కొని జీవిస్తున్నారని పేర్కొన్నారు.ఇది ఓర్వలేక దళిత వ్యతిరేక శక్తులు హమారా ప్రసాద్ తో ఇలాంటి అసత్య రాతలు రాయిస్తున్నారని తెలిపారు అ.దీనిపై మేధావులు స్పందించాలని కోరారు.ఈ కార్యక్రమం లో కొమ్మెట రాజు చుంచు మల్లేష్, సడిమెల ఎల్లం,కొల్లూరి నాగరాజు, బట్టు పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో చేరిన మాదాపూర్ సర్పంచ్ మాదరి శ్రీనివాస్

**గన్నేరువరం,సెప్టెంబర్15 (జనంసాక్షి):**గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామ సర్పంచ్ మాదరి శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజా భవన్ లో ఆయనకు టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్. కవ్వంపల్లి సత్య నారాయణ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో అన్నివర్గాల





ప్రజలకు లబ్ధిచేకూరుతున్నదని చెప్పారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలను నోచుకోని ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంలో వాటిని పొందుతూ సంతృప్తిగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు నచ్చి చాలా మంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మాదాపూర్ సర్పంచ్ శ్రీనివాస్ బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ కుటుంబంలో చేరడం సంతోషకరమని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రీనివాస్ కు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. గ్రామ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునిల్,పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కు ఉపేందర్ రెడ్డి, పార్టీ నాయకులు కొమ్మెర రవీందర్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు కటికం తిరుపతి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాతంగి అనిల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మార్గ మల్లేశం, కళ్ళెం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# వజ్జేపల్లిలో డీజే సీజ్ నిర్వాహకులు యజమాని ఆపరేటర్‌పై కేసు నమోదు

**సదాశివనగర్,సెప్టెంబర్15(జనంసాక్షి):**సదాశివనగర్ మండలంలోని వజ్జేపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా డీజే నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు సంబంధిత నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.డీజే నిర్వహణకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను ఇప్పటికే ప్రజలకు స్పష్టం చేసినప్పటికీ వాటిని ఉల్లంఘిస్తూ ధగడ్ యూత్ ఆధ్వర్యంలో డీజే నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో డీజే నిర్వాహకులతో పాటు డీజే యజమాని, ఆపరేటర్‌పై కేసు నమోదు



చేశారు.డీజేకు వినియోగించిన వాహనం, ఇతర సామగ్రిని సీజ్ చేశారు.నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, పోలీస్ శాఖ సూచనలకు విరుద్ధంగా డీజేలు నిర్వహిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజల శాంతి, భద్రత, ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు డీజే నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, శాంతియుత వాతావరణ పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని పోలీసులు కోరారు.

# కొండాపూర్‌లో భూ భారతి రీసర్వే అవగాహన సదస్సు

**చిగురుమామిడిసెప్టెంబర్15(జనంసాక్షి):**మండలంలోని కొండాపూర్ గ్రామంలో మంగళవారం భూ భారతి రీ-సర్వేపై గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిగురుమామిడి తహశీల్దార్ కే.కనకయ్య,కరీంనగర్ ఏడీ (ఏ.డి)కిషన్ రావు,డీఐ (డి.ఐ)శ్రీనివాస్,గ్రామ సర్పంచ్ మార్క రాజ్ కుమార్,మండల సర్వేయర్ బాలమురళీకృష్ణ హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు భూ భారతి రీ-సర్వే యొక్క ముఖ్య ఉద్దేశాన్ని,దాని వల్ల రైతులకు జరిగే ప్రయోజనాలను గ్రామ ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు.గ్రామంలోని ప్రతి సర్వే నెంబరును,ప్రతి ఎకరా భూమిని నిక్కచ్చిగా రీ-సర్వే





చేస్తామని స్పష్టం చేశారు.381గ్రామ మొత్తం, విస్తీర్ణం 1054 ఎకరాల 33గుంటలు,పట్టా భూముల సర్వే నెంబర్లు 365(విస్తీర్ణం:951ఎకరాల 20గుంటలు)ప్రభుత్వ సర్వే నెంబర్లు:16(విస్తీర్ణం: 83 ఎకరాల 24 గుంటలు)గ్రామకంఠం విస్తీర్ణం :8ఎకరాల 14 గుంటలు ఈ అవగాహన సదస్సులో భాగంగా భూ సమస్యలపై పలువురు రైతులు అడిగిన సందేహాలకు,ప్రశ్నలకు అధికారులు పూర్తిస్థాయిలో వివరణ ఇచ్చి నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బింగి రాజేంద్రప్రసాద్, ప్రజాప్రతినిధులు,రెవెన్యూ సిబ్బంది,పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతాంగాన్ని ఆదుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

**సిరికొండ, సెప్టెంబర్ 15(జనం సాక్షి ):** రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య విమర్శించారు. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను మంగళవారం పోటు రంగారావు పార్టీ జెండాను ఎగురవేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగం పట్ల పూర్తి వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతుల గొంతు కోస్తున్నారని విమర్శించారు. రైతులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఢిల్లీ వేదికగా సుదీర్ఘంగా పోరాటం చేసిన సమయంలో వారిపై పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించి ఉక్కుపాదం






తో అణచివేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పిస్తామని, రైతాంగ సమస్యలను పరిష్కరిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా విస్మరించిందని అన్నారు. అదానీ తదితర కార్పొరేట్ వర్గాలకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని బలహీనపరిచే విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని వారు విమర్శించారు. రైతులకు భరోసా కల్పించే విషయంలో ప్రభుత్వం అనేక పరిమితులు విధిస్తోందని అన్నారు. పోడు భూములకు హక్కులు కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదని తీవ్రంగా విమర్శించారు.రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటితమై పాలక వర్గాల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. బలమైన ప్రజా పోరాటాల ద్వారానే ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ముందుగా అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం మొదటి రోజు శిక్షణ తరగతుల్లో వి.ఐ. రమణ "తత్వశాస్త్రం" అంశంపై బోధించారు.ఈ కార్యక్రమంలో సెక్రటేరియట్ సభ్యులు కెచ్చల రంగయ్య, కట్ట రమ, వి. ప్రభాకర్, వి. కృష్ణ, చిన్న చంద్రన్న, ఎం. కృష్ణ, సూర్యం, హన్మేశ్, ఎస్.ఎల్. పద్మ, రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ, బి. రాము, జి. రామయ్య, సి.వై. పుల్లయ్య, నందిరామయ్య, జిల్లా నాయకులు ఆర్. రమేష్, బి. దేవరం, నాయకులు ఆర్. దామోదర్, బి. బాబన్న, కిషోర్, రమేష్, రమ, సత్తెమ్మ, పుష్ప, జమున, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు భద్రత కరువు




**గంభీరావుపేట, సెప్టెంబర్,15 జనం సాక్షి:** మండల కేంద్రంలోని దోసలగూడెం కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు భద్రత కరువైంది. గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల విద్యుత్ మీటర్‌ను ధ్వంసం చేయడంతో పాటు బాత్రూం డోర్లను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. గత నాలుగేళ్లుగా ప్రహరీ గోడ లేకపోవడంతో రాత్రివేళ పాఠశాల ఆవరణ కొందరికి అడ్డాగా మారిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా గతంలో ప్రహరీ గోడను తొలగించినట్లు తెలిపారు. పాఠశాల సమీపంలోని స్క్రాప్ షాపు వద్ద ప్లాస్టిక్ వస్తువులు, సీసాలు, ఇతర వ్యర్థాలు రోడ్డుపై పేరుకుపోతున్నాయని వాపోయారు. దీంతో విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించడంతో పాటు స్క్రాప్ షాపుపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, కాలనీవాసులు కోరుతున్నారు.

# రీజినల్ స్థాయి బాడి బిల్డింగ్ పోటీలను ప్రారంభించిన ఐఈ డిజియం




**రామగిరి జనం సాక్షి (సెప్టెంబర్ 15):**రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ & గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలోని సి.ఈ.ఆర్ క్లబ్ నందు ఆర్.జి-3, ఎ.పి.ఎ, భూపాలపల్లి ఏరియాల క్రీడాకారుల మధ్య రీజినల్ స్థాయి బాడిబిల్డింగ్. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించారు.ఈ పోటీలను ఏరియా ఐఈ డిజియం బి.టి.మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సంవత్సరం వివిధ క్రీడలలో పోటీలను నిర్వహిస్తుందన్నారు. కావున నిత్యం ఉద్యోగులు సాధన చేస్తూ, నైపుణ్యం సాధిస్తూ ముందుకెళ్లాలన్నారు. అంతేకాకుండా కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయిలలో నిర్వహించు పోటీలలో నైపుణ్యాన్ని ప్రదర్శించి మన రీజియన్ పేరు నిలబెట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, గౌరవ కార్యదర్శి ఎన్.వంశీధర్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్సా శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బుర్ర సదానందం, ఇతర నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు

# గంభీరావుపేటలో కొలువుదీరిన గణపయ్యలు

**గంభీరావుపేట, సెప్టెంబర్,15 జనం సాక్షి:**మండల వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వివిధ గ్రామాల్లో గణపతి విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించి తొలి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. లింగన్నపేటలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## సొంత నిధులతో పోచమ్మ ఆలయ అభివృద్ధి



**సిరికొండ, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):** కుర్దుల్పేట్ గ్రామంలోని పోచమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి గ్రామ సర్పంచ్ గాండ్ల నవనీత సతీష్ పటేల్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆలయంలోని పాత ఫ్లోరింగ్ దెబ్బతినడంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా తన సొంత నిధులతో నూతన టైల్స్ వేయించే పనులను చేపట్టారు.అదేవిధంగా దేవతా మూర్తుల కోసం నూతన గద్దెల నిర్మాణ పనులను కూడా చేపట్టారు. ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.గ్రామ అభివృద్ధితో పాటు ఆలయాల అభివృద్ధికి కూడా తనవంతు సహకారం అందిస్తానని సర్పంచ్ తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులకు సొంత నిధులు వెచ్చించి చొరవ చూపిన సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందించారు.

## రైతు వేదికల నందు నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పై రైతులకు శిక్షణ కార్యక్రమం



**జమ్మికుంట, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):**రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా రాష్ట్రంలోని రైతు వేదికల నందు నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పై రైతులకు శిక్షణ కార్యక్రమం ఆబాది జమ్మికుంట రైతు వేదిక నందు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు గుండా సునీత,మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ లు పాల్గొని మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, మానవాళి ఆరోగ్యం, ప్రకృతి పర్యావరణ, ఘన జీవామృతం, ధ్రువ జీవామృతం, అగ్ని అస్త్రం, నీమాస్త్రం,కషాయాల తయారీ విధానం పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మడిపల్లి, అంకుషాపూర్, కోరపల్లి, వెంకటేశ్వర పల్లి గ్రామాల రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నూతన స్కూల్ యూనిఫామ్ అందజేసిన సర్పంచ్ రేపాక బానవ్వ



**గన్నేరువరం,సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** మండలంలోని చాకలివానిపల్లి గ్రామంలో మంగళవారం ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థు లకు సర్పంచ్ రేపాక బానవ్వ ప్రభుత్వం పంపిణి చేసిన స్కూల్ యూనిఫామ్ లను అందచేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వం అందచేస్తున్న ప్రొచహాలను అంధుపుచుకొని సాధ్వినియోగ పరుచుకోవాలని విధ్యావంతులు కావాలని, రోజు క్రమం తప్పకుండ పాఠశాలకు హాజరుకావాలని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాం క్షించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చుక్కయ్య, ఉపాధ్యాయురాలు రజిత, విద్యార్థులు,వార్డ్ సభ్యులు బోయిని బాలయ్య, నక్క లావణ్య, కూన స్రవంతి, బామండ్ల శ్రీలత, రేపాక బాబు,కూన యాదగిరి పాల్గొన్నారు.

# జ్యోతిబాపూలే పాఠశాలలో హిందీ భాష దినోత్సవం

గంగాధర సెప్టెంబర్15( జనం సాక్షి ):హిందీ భాష దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల మరియు కళాశాలలో హిందీ భాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హిందీ పండిట్ వై విశ్వకర్మ మరియు జాకీరుద్దీన్ లను సన్మానించి ప్రిన్సిపాల్ బొజ్జ సురేష్ కుమార్ మాట్లాడుతూ హిందీ అనేది కేవలం ఒక భాష మాత్రమే కాదు ఇది భారతదేశంలోని కోట్లాది ప్రజలను కలిపే ఒక ముఖ్యమైన వారధి మన భావాలను ఆలోచనలను సంస్కృతిని మరియు సాంప్రదాయాలను వ్యక్తపరచడానికి భాష ఒక శక్తివంతమైన సాధనమని హిందీ భాష దేవ నగరి లిపిలో భారతదేశ రాజభాషగా స్వీకరించింది సంస్కృతులు సంప్రదాయలకు నిలయం హిందీ భాష హిందీ భాషకు ఎంతో గొప్ప సాహిత్య సంపద



ఉంది కబీర్దాస్ తులసీదాస్ సోదాస్ ప్రేమ్చంద్ మహాదేవి వర్మ రాందాస్ గొప్ప రచయితలు హిందీ సాహిత్యాన్ని ఎంతో సమృద్ధిగా చేశారు వారి రచనలు సమాజానికి మంచి సందేశం లభించాయ ని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కైలాసం రాజు వరుణ్జ్యోతి బి సత్యనారాయణ రావు శ్రావణ్ కుమార్ సంపత్ శ్రీనివాస్ వంశీకృష్ణ జై సింగ్ విశ్వకర్మ మల్లేశం బొడ్డు రమేష్ మంగరాణి ప్రసన్న రమేష్ హేమశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరం బీజేపీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన

**గన్నేరువరం,సెప్టెంబర్15(జనంసాక్షి):**గన్నేరువరం మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. మండల బీజేపీ అధ్యక్షులు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో గుంతల రోడ్డుపై కాగితపు పడవలు వదిలి నిరసన తెలిపారు. గుండ్లపల్లి,పొత్తూరు డబుల్ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ గన్నేరువరం నుండి గుండ్లపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై గుంతల్లో నిలిచిన నీటిలో కూర్చొని బీజేపీ నాయకులు నినాదాలు చేశారు. డబుల్ రోడ్డు పనులు తక్షణమే పూర్తి చేయాలని, ప్రజల రాకపోకల సమస్యను పరిష్కరించాలని కోరారు.





గత ఆగస్టు 10వ తేదీన గుండ్లపల్లి రాజీవ్ రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా చేసినా.. 30 రోజులు గడిచినా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాలేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మంగళవారం గన్నేరువరం మండల కేంద్రంలో గుంతల రోడ్డుపై కాగితపు పడవలతో వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. ఈ సమస్యను ప్రభుత్వం పట్టించుకోకపోతే రానున్న రోజుల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు మచ్చ సాయి కృష్ణ, మండల నాయకులు సందవేణి ప్రశాంత్, బండి తిరుపతి, అరికాంతం అనిల్ రెడ్డి, మునగంటి లింగయ్య, పుల్లెల జగన్, కుర్ర హరీష్, టేకు అనిల్, గూడూరి జగన్, జీల కుమార్ యాదవ్, బుర్ర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీ 1 జట్టుకు కబడ్డీలో ఘన విజయం

యైటింక్లైన్ కాలనీ, (జనంసాక్షి)సెప్టెంబర్ 15: 2026-27 క్రీడల్లో భాగంగా అర్జీ-2, అర్జీ-1 ఏరియాల నియర్ బై ఏరియా క్రీడాకారుల ఎంపికలో భాగంగా కబడ్డీ రీజినల్ మీట్ పోటీలు మంగళవారం ఎన్‌సీఓఏ క్లబ్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ పోటీలను ఏరియా అధికార ప్రతినిధి, హెచ్ఓడీ (పర్సనల్) ఎన్. వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.క్రీడలు సింగరేణి సంస్థలో ప్రతి ఒక్కరికీ ఒక సెలబ్రేషన్ లాంటివని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, సానుకూలతను పెంపొందించడంతో పాటు మంచి ఆరోగ్యం, క్రమశిక్షణ, టీమ్ వర్క్‌ను అభివృద్ధి చేస్తాయని పేర్కొన్నారు. వర్క్--లైఫ్ బ్యాలెన్స్‌లో క్రీడల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.మహిళా ఉద్యోగులు క్రీడల్లో రాణించా లని, పోటీల్లో ప్రతిభ కనబరిచి కంపెనీ స్థాయి పోటీలకు ఎంపికై సింగరేణి సంస్థకు పేరు తీసుకు రావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని



సూచించారు.అర్జీ-1 జట్టుదే విజయంఅర్జీ-1, అర్జీ-2డివిజన్ల మధ్య జరిగిన నియర్ బై ఏరియా కబడ్డీ పోటీలో అర్జీ-1జట్టు విజయం సాధించింది. విజేత జట్టు క్రీడాకారులను అధికారులు, నిర్వాహకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో క్రీడల గౌరవ కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు రాజారత్నం, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్ రెడ్డి, అర్జీ-2 స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మహ్మద్ అక్రం, అర్జీ-1 స్పోర్ట్స్ కోఆర్డినేటర్ రాజయ్య, రెఫరీలు ముకేష్, సురేష్, జనరల్ కెప్టెన్ ఏ. రవీందర్ రెడ్డితో పాటు పలువురు క్రీడాకారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# అల్లూరులో కొలువుదీరిన వినాయకునికి రాజ్ ఠాకూర్ ప్రత్యేక పూజలు

**యైటింక్లైన్ కాలనీ, (జనంసాక్షి)**సెప్టెంబర్ 15:వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని 19వ డివిజన్ 8వ కాలనీ అల్లూరులోని శ్రీ అల్లూరు భక్తాంజనేయ వినాయక మండపం టెంపుల్‌లో కొలువుదీరిన శ్రీ వినాయకుడిని రామగుండం ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో వినాయకుడిని పూజించి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాల తో జీవించాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ అల్లూరు మెయిన్ రోడ్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల్లో ఎలాంటి వెనకడుగు వేయబోమని, అల్లూరు అభివృద్ధికి కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో



19వ డివిజన్ కార్పొరేటర్ మారెల్లి సుశీల రాజిరెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ అనుము రాములు, 20వ డివిజన్ ఇన్‌చార్జ్ బండ రమేష్ రెడ్డి, కార్పొరేటర్ నీలాంటి రాము, జక్కుల దామోదర్, డివిజన్ అధ్యక్షులు మర్కా రాజు, మోత్కూరు శంకర్, కోరండ్ల రాజిరెడ్డి, ఆకుల శ్రీనివాస్, ఆరెల్లి శ్రీను, మారెల్లి వికాస్ రెడ్డి, నాసారపు వెంకటేష్, ఫయాజ్, అప్సర్, 8వ కాలనీ పట్టణ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మేకల అజయ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాధనంతో కార్పొరేటర్లకు ఫోన్లు కొనడం సిగ్గుచేటు

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 15, ( జనం సాక్షి)**ప్రజలు ఇంటి పన్ను, నల్లా పన్ను, చెత్త పన్ను తదితర రూపాల్లో చెల్లిస్తున్న ప్రజాధనంతో 66 మంది కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులకు సుమారు రూ.40 వేల విలువైన సెల్‌ఫోన్లు కొనివ్వడం ప్రజాధన దుర్వినియోగమేనని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం విమర్శించారు .గతంలో ఫోన్ల కొనుగోలుకు టెండర్లు పిలిచిన సమయంలో సీపీఎం ఆధ్వర్యంలో టెండర్లను రద్దు చేయాలని ఆందోళన చేసినప్పటికీ, కార్పొరేటర్లు కుమ్మక్కై ప్రజాధనంతో ఫోన్లు కొనుగోలు చేయడం విచారకరమన్నారు. పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన డబ్బును రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, ఇతర ప్రజా సౌకర్యాల కోసం వినియోగించాల్సింది



పోయి కార్పొరేటర్లకు ఫోన్లు కొనడం ఏమిటని ప్రశ్నించారు. ఇన్నోవా కార్లలో తిరిగే కార్పొరేటర్లకు సొంతంగా మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసుకునే స్థోమత లేదా అని ప్రశ్నించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఫోన్ ద్వారా సమాచారం తీసుకుంటున్నామని చెప్పడం సరికాదన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రజావాణి, ఫోన్ ఇన్ కార్యక్రమాలు ఇప్పటికే ఉన్నాయని గుర్తుచేశారు. అవసరమైతే కార్పొరేటర్లకు సిమ్ కార్డులు మాత్రమే అందించవచ్చని, సెల్‌ఫోన్లు కొనుగోలు చేయడం మాత్రం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని అన్నారు. ఇప్పటికైనా కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు ప్రజాధనంతో కొనుగోలు చేసిన సెల్‌ఫోన్లను తిరిగి ఇచ్చి ప్రజలకు సమాధానం చెప్పాలని సత్యం డిమాండ్ చేశారు.

# కరీంనగర్‌లో ఘనంగా బీజేపీ భారీ తిరంగా ర్యాలీ

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర బిజెపి పిలుపు మేరకు సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ 'తిరంగా బైక్ ర్యాలీ' నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో గీతాభవన్ నుండి ప్రారంభమైన ఈ తిరంగా ర్యాలీ కమాన్ సర్కిల్, ధోభివాడ, ఎల్ఐసి ఆఫీస్, భగత్ సింగ్ విగ్రహం చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. యువకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున త్రివర్ణ పతాకాలు చేతబూని భారత్ మాత కి జై అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం బీజేపీ జిల్లా జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, నాయకులు నేరుగా కలెక్టరేట్‌కు చేరుకొని సెప్టెంబర్ 17ను అధికారికంగా విమోచన దినోత్సవంగా నిర్వహించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సెప్టెంబర్ 17 'ప్రజా పాలన దినోత్సవం దేనికి విమోచన దినోత్సవమే అధికారికంగా జరపాలిసాయిని మల్లేశం రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'ప్రజా పాలన దినోత్సవం'గా మార్చడాన్ని సాయిని మల్లేశం తప్పుపట్టారు. నిరంకుశ రజాకార్ల పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన చారిత్రక దినమైన సెప్టెంబర్ 17ను, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'తెలంగాణ విమోచన దినోత్సవంగా' నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారిక వేడుకల నిర్వహణలో ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. విమోచన దినోత్సవం నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉన్న ఇబ్బంది ఏంటో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రజాకర్ వారసుల పార్టీ కి



భయపడి విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదా అని ప్రశ్నించారు. మహారాష్ట్ర, కర్ణాటకలో అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాలు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవం ను గుర్తించి ప్రతి ఏటా అధికారికంగా కార్యక్రమం నిర్వహిస్తుందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేని స్థితిలో ఎందుకు ఉందో తెలంగాణ ప్రజలకు, సమాజానికి జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, మేయర్ కోలగాని శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వై సునీల్ రావు, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, సీనియర్ నాయకులు కన్నెబోయిన ఓదెలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనకొండ నాగేశ్వర్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ కార్పొరేటర్ బోయిన పల్లి ప్రవీణ్ రావు, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ రావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, ఎర్రబెల్లి సంపత్ రావు, జిల్లా కార్యదర్శులు చేపూరి సత్యం, కార్పొరేటర్ లు మాసం గణేష్,కర్రె అనిల్, ఎన్నం ప్రకాష్, మునీందర్ , ఏపీపీ చంద్ర , నాంపల్లి శ్రీనివాస్, సోమిడి వేణు ప్రసాద్ , మీడియా కన్వీనర్ కట్కం లోకేష్ , బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లు బొంతల కల్యాణ్ చంద్ర,యువ మోర్చ జిల్లా నాయకులు, బీజేపీ జిల్లా నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోషణ్ మాసంలో పోషకాహారంపై అవగాహన



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 15, ( జనం సాక్షి)**కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని కట్టరాంపూర్--2 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ కవిత మాట్లాడుతూ చిన్నారులకు మాంసకృత్తులు అధికంగా ఉండే పోషకాహారాన్ని అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నామని, ప్రతిరోజూ ఆకుకూరలు, పప్పులు, కూరగాయలతో కూడిన పోషకాహారాన్ని పిల్లలకు అందిస్తున్నట్లు తెలిపారు. గర్భధారణ నుంచి బిడ్డకు రెండేళ్లు పూర్తయ్యే వరకు ఉన్న వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని, ఈ కాలంలో సమతుల్యమైన పోషకాహారం అందిస్తే పిల్లల మెదడు అభివృద్ధి మెరుగ్గా ఉంటుందని వివరించారు .కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, కట్టరాంపూర్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సాయిరాజు, ఐసీపీఎస్ సిబ్బంది రమేష్, కిరణ్, ఏఎన్ఎం సంపూర్ణ, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, పద్మతో పాటు తల్లులు పాల్గొన్నారు. తల్లులు స్వయంగా తయారు చేసి తీసుకొచ్చిన వివిధ రకాల పోషకాహార వంటకాలను ప్రదర్శించగా, ఉత్తమ వంటకాలు తయారు చేసిన వారికి బహుమతులు అందజేశారు.

## అమ్మ పరివార్ ఆశ్రమంలో నిధిష్ బాబు జన్మదిన వేడుకలు



**గోదావరిఖని, జనంసాక్షి** :రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తనయుడు నిధిష్ బాబు జన్మదిన వేడుకలను అమ్మ పరివార్ ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి, వారితో కలిసి జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు మిఠాయిలు అందించి, వారితో ఆప్యాయంగా గడిపారు. నిధిష్ బాబుకు చిన్నారులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## చిగురుమామిడి మండలంలో భారీ వర్షం



**చిగురుమామిడి సెప్టెంబర్ 15(జనంసాక్షి)**:కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో సోమవారం తెల్లవారుజామున 3గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వానతో మండలంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. ముఖ్యంగా మండలంలోని సుందరగిరి గ్రామంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. భారీ వానకు సుందరగిరిలోని అన్ని కుంటలు అలుగులు (మత్తళ్లు )దూకుతున్నాయి. గ్రామంలోని ప్రధాన చెరువులు సైతం ఇప్పటికే 70శాతం మేర నీటితో నిండి,నిండుకుండలను తలపిస్తున్నాయి. వర్షాల ధాటికి జలాశయాల్లోకి ఒక్కరోజులోనే భారీగా ఇన్-ఫ్లో వస్తుండటంతో స్థానిక రైతులు,ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వీణవంక లో ఉద్యోగ పెన్షనర్ల ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి




**వీణవంక సెప్టెంబర్ 15(జనం సాక్షి)** వీణవంక ఉద్యోగ పెన్షనర్ల ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ వీణవంక మండలంలో చేపట్టిన డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి,ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో తెలిపిన విధంగా ఉపాధ్యాయ ఉద్యోగ,పెన్షనర్ల సమస్యలు ఎక్కడివక్కడే పెండింగ్లో ఉన్నాయని.ఇదిగో అదిగో అంటు ప్రభుత్వం దాట వేసే దోరణిలో ఉందంటూ జిల్లా అధ్యక్షులు అవాల నరహరి ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఉద్యోగుల సమస్యలపై స్పందించాలని,పిఆర్సినీ 45%శాతం ఫిట్మెంటు ప్రకటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏభుషి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సలర్ సదానందం,జిల్లా కౌన్సలర్,జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు గూటం ఉమారెడ్డి,జిల్లా కౌన్సిలర్ మేక మల్ల శ్రీనివాస్,జిల్లా బాధ్యులు,సంపత్ రెడ్డి,మండల బాధ్యులు కనకం శ్రీనివాస్,చీటి వెంకట నరసింహ రెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



**మల్లాపూర్, సెప్టెంబర్ 15(జనంసాక్షి)** మండలంలోని పాత దాశీరాజు పల్లి గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో ఖానాపూర్సింధుశ్రీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మేనేజింగ్ డైరెక్టర్ కొప్పుల లక్ష్మణ్ డాక్టర్.ఇమ్రాన్ పాషా ఎం డి.ఆదిత్య ఐ కేర్ డాక్టర్ సన్నిత్ కుమార్ లతో ఉచిత మెగా క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని ఖానాపూర్ సింధు శ్రీ హాస్పిటల్స్ డాక్టర్లతోపాటు సర్పంచ్ రోశీడ్ల రాజేశ్వరి రాజారెడ్డి.ఉప సర్పంచ్. ఇప్పపెల్లి గణేష్ లు ప్రారంభించారు. గ్రామ ప్రజలు ఫ్రీ హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీ నరసయ్య, బీజేవైఎం జిల్లా నాయకులు పందిరి నాగరాజు, స్థానిక నాయకులు అయ్యోరి దశరథం, కొత్తూరు గంగారెడ్డి మామిడాల శంకర్ పాల్గొన్నారు

## హమరా ప్రసాద్ పై పోలీస్ కంప్లైంట్



**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమరా ప్రసాద్ వెంటనే క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సర్వగల్ల రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్ద కొడప్గల్ పోలీస్ స్టేషన్లో హమరా ప్రసాద్పై ఎస్ఐ అరుణ్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్పై దుష్ప్రచారం చేయడం సరికాదని, క్షమాపణ చెప్పకుంటే వదిలే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద కొడప్గల్ మండల అధ్యక్షుడు బలరాం, ఉపాధ్యక్షుడు శ్రీమాన్, సభ్యులు మారుతి, లాలు, సాయిలు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీర్ల సేవలు అభినందనీయం



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 15, ( జనం సాక్షి)**జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ అబ్దుల్ రెహమాన్తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత భారతదేశ ప్రముఖ ఇంజనీర్, ఇంజనీరింగ్ రంగానికి విశేష సేవలందించిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ రంగంలో చేసిన కృషి చిరస్మరణీయమని, దేశంలో అనేక ప్రముఖ నిర్మాణాలు, ప్రాజెక్టుల అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుత ఇంజనీర్లు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఇంజనీర్స్ డే సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయి సివిల్ ఇంజనీర్లకు క్రీడా పోటీలను నిర్వహించారు. వివిధ క్రీడల్లో ఇంజనీర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. క్రికెట్ విభాగంలో సిరిసిల్ల జట్టు విజేతగా నిలవగా, ఆ జట్టు కెప్టెన్ ప్రవీణ్ కుమార్కు ఎస్ఈ అబ్దుల్ రెహమాన్ బహుమతి అందజేశారు. బ్యాడ్మింటన్లో కరీంనగర్కు చెందిన ప్రవీణ్ సాయి, చెస్లో ఆదిత్య ప్రకాశ్ విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు.అలాగే ప్రభుత్వ విభాగాల్లో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఇంజనీర్లను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇంజనీర్ల సేవలను అభినందిస్తూ వారి కృషిని అధికారులు ప్రశంసించారు. ఇంజనీర్ల వృత్తిపరమైన నైపుణ్యాలతో పాటు క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# బస్ స్టాండ్ వద్ద బారికేడ్ల ట్రాఫిక్ తంటాలు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 15 జనం సాక్షి :** నగరం నడిబొడ్డున ఉన్న ప్రధాన బస్ స్టాండ్ ప్రాంతంలో ప్రయాణికుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్ల వైనం ప్రస్తుతం సామాన్యులకు పెనుశాస్త్రంగా మారింది. అసలు ఈ బారికేడ్లు ఎవరి సౌకర్యార్థం ఏర్పాటు చేశారనే దానిపై ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో ప్రశ్నలు వ్యక్తశీ అవుతున్నాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో అధికారులు చేపట్టిన ఈ చర్యలు క్షేత్రస్థాయిలో వికటించడంతో, నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు నరకం చవిచూడాల్సి వస్తోంది. అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తున్న ఈ పరిస్థితులపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.బస్ స్టాండ్ ప్రధాన ముఖద్వారం వద్ద ఆటో డ్రైవర్ల ఇష్టారాజ్యం శృతి మించిపోయింది. ఎలాంటి నియంత్రణ లేకుండా రోడ్డు మధ్యలోనే ఆటోలను నిలిపివేయడం, ఇష్టానుసారంగా ప్రయాణికులను ఎక్కించుకోవడం పరిపాటిగా మారింది. ఈ అనధికార పార్కింగ్ వల్ల వెనుక వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ముందుకు కదలలేక గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. మరోవైపు, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన యంత్రాంగం, గత రెండు రోజులుగా అటువైపు కూడా కొత్తగా బారికేడ్లను ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ కొత్త ఏర్పాట్లతో రోడ్డు మార్గం మరింత కుచించుకుపోయి, సాధారణ వాహన దారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొ ంటున్నారు.ఈ బారికేడ్ల ఏర్పాటు వల్ల రోడ్డు స్థలం తగ్గిపోయి పాదచారులు నడవడానికి కూడా అడుగు ముందుకు వేయలేని ప్రమాదకర వాతావరణం నెలకొంది. బస్ స్టాండ్లోకి వెళ్లాలన్నా, లేక రోడ్డు దాటాలన్నా వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర భయాం దోళనలకు గురవుతున్నారు. అధికారుల అశాస్త్రీయ నిర్ణయాలు, క్షేత్రస్థాయి వాస్తవాలను (గ్రౌండ్ రియాలిటీ) గమనించ కుండా తీసుకుంటున్న చర్యలే ఈ దుస్థితికి ప్రధాన కారణమని ప్రజలు మండి పడుతున్నారుప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పాదచారులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా బారికేడ్ల వ్యవస్థను శాస్త్రీయ పద్ధతిలో సరిదిద్దాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# జేఏసీ ఆధ్వర్యంలో దారం శ్రీనివాస్ రెడ్డికి ఘనంగా జన్మదిన వేడుకలు



**కరీంనగర్, క్రైమ్ సెప్టెంబర్ 15 ( జనంసాక్షి )** :కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీ ధారం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం కరీంనగర్లోని టీఎన్జీవోల సంఘ భవన్లో టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు కలిసి శ్రీ ధారం శ్రీనివాస్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో జీవించాలని, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు..కరీంనగర్ జిల్లా టీఎన్జీవోల సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, ఉద్యోగుల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో ఉద్యోగుల హక్కుల సాధన కోసం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణ్ రావు గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపెల్లి కాళి చరణ్ కార్యదర్శి ఎడ్ల అరవింద్ రెడ్డి టీఎన్జీవోల సంఘం కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్ సర్దార్ హర్మీందర్ సింగ్ ప్రభాకర్ రెడ్డి ఎమ్.ఎ హమీద్ రాజయ్య గౌడ్ పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్ కార్యదర్శి , వెలిచాల సుమంతరావు తిమ్మాపూర్ అధ్యక్షులు పోలు కిషన్ రూరల్ అధ్యక్షులు వాస్తవిక్ గౌడ్ కార్యదర్శి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి పెన్షనర్ల సంఘం నాయకులు ఉస్మాన్ పాషా పెండ్యాల కేశవరెడ్డి ఎలదాసరి లింగయ్య నాలుగవ తరగతి ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు కోట రామస్వామి కార్యదర్శి శంకర్ జిల్లా నాయకులు రమేష్ గౌడ్ ప్రసాద్ రెడ్డి ఇరుమల్ల శారద సునీత కరుణ సూర్య శైలజ సత్యనారాయణ నరేష్ పటేల్ శంషుద్దీన్ వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# మానేర్‌లో ముగిసిన ఎస్జీఎఫ్ కబడ్డీ క్రీడోత్సవాలు




**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి)** :కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాల ఆవరణలో జరుగుతున్న 70వ కరీంనగర్ అర్బన్ అండర్ 14, 17 బాలబాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు మంగళవారం రోజు ముగిసాయి. బాలబాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన జట్లకు మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి ట్రోఫీలను, పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం కలుగుతు ందన్నారు. ఎస్జీఎఫ్ క్రీడల్లో విద్యార్థులు అద్భుతంగా రాణించి జిల్లా పేరు నిలుపాలన్నారు. మానేరు లో వరుసగా రెండో సంవత్సరం ఎస్జీఎఫ్ కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. క్రీడలతో పాటు విద్యలోను రాణించాలని విద్యార్థు లకు సూచించారు. భవిష్యత్‌లో మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలను నిర్వహించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎస్జీఎఫ్ అర్బన్ కార్యదర్శి అంతటి శంకరయ్య మాట్లాడుతూ... అండర్ 14, 17 బాలబాలికల విభాగంలో సుమారు 60 పాఠశాలల నుంచి 2500 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. అర్బన్ పోటిల్లో రాణించిన క్రీడాకారు లను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మానే రు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో ఎస్జీఎఫ్ మాజీ కార్యదర్శి వేణుగోపాల్, పీడీ, పీఈటీలు సిలివేరి మహేందర్, లింగారావు, శ్రీధర్ రెడ్డి, నరేష్, చిరంజీవి, మహేష్, శ్రీనివాస్, అర్జున్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# యువ ఆపద మిత్ర శిక్షణకు 120 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఎంపిక




**కరీంనగర్ కల్చరల్,సెప్టెంబర్ 15 (జనం సాక్షి):** శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలలకు చెందిన 120 మంది జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లు యువ ఆపద మిత్ర పథకానికి ఎంపికయ్యారు. వీరికి సెప్టెంబర్ 16 నుంచి 22వ తేదీ వరకు వారం రోజుల పాటు మంచిర్యాల జిల్లాలోని గుడిపేట్ 13వ బెటాలియన్‌లో విపత్తు నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.భారత ప్రభుత్వ జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, మానవ తప్పిదాల కారణంగా సంభవించే విపత్తుల సమయంలో సహాయక, రక్షణ చర్యలు చేపట్టడం, విపత్తులపై ప్రజల్లో ముందస్తు అవగాహన కల్పించడం, అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించే విధంగా యువతను సిద్ధం చేయడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశంగా అధికారులు తెలిపారు.శిక్షణలో భాగంగా ప్రతి వాలంటీర్‌కు సుమారు రూ.10 వేల విలువైన విపత్తు సహాయక సామగ్రి కిట్‌ను అందించడంతో పాటు బీమా సదుపాయాన్ని కూడా కల్పించను న్నారు.ఈ సందర్భంగా శాతవాహన విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం నుంచి 120 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రెండు బస్సుల్లో మంచిర్యాలకు బయలుదేరారు. ఈ బస్సులను శాతవాహన విశ్వవిద్యాలయం ఓఎస్డీ డా. డి. హరికాంత్, జిల్లా యువజన అధికారి జి. తిరుపతి రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మావతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. డి. విజయ్‌కుమార్, డా. కె. తిరుపతి, డా. కె. అర్జున్, శ్రీమతి ఎలిజబెత్ రాణి, డా. వెంకటేశ్వర్లు, డా. సంగీతారాణి,డా.అరవింద్ తదితరులు పాల్గొన్నారు .యువ ఆపద మిత్ర శిక్షణను వాలంటీర్లు సద్విని యోగం చేసుకుని విపత్తు నిర్వహణలో అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, భవిష్యత్తులో విపత్తుల సమయంలో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని విశ్వవిద్యాలయ అధికారులు ఆకాంక్షించారు.



# రాజన్న ప్రసాదంగా కోడెల పంపిణీ



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (జనంసాక్షి)**భక్తులు వేములవాడ రాజన్నకు సమర్పించే నిజ కోడేలను గోశాల తరలిస్తుంటారు. అక్కడ నిల్వ ఉన్న కోడేలను రైతులకు రాజన్న ప్రసాదంగా పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.రాజన్న ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో కోడెలను సన్న,చిన్నకారు రైతులకు రాజన్న ప్రసాదంగా అందించే కార్యక్రమాన్ని మంగళవారం ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరైయ్యారు.ఈ సందర్భంగా పలువురు రైతులకు కోడెలను అందజేశారు. .రైతులు రాజన్న ప్రసాదంగా భావించి, తమ బిడ్డలను ఎలా చూసుకుంటారో అలాగే కోడెలను సంరక్షించాలని కోరారు. కోడెల సంరక్షణపై దేవాదాయ, పశు సంవర్ధక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు.కోడెలకు నాణ్యమైన దాణా, వైద్య సేవలు.కోడెలకు ఆరోగ్య సమస్యలు రాకుండా టీకాలు,వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. నాణ్యమైన పోషకాహారం, దాణా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పార పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు.ఆలయ ఈవో,జిల్లా పశువైద్య,పశు సంవర్ధక శాఖ అధికారి, వ్యవసాయ శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి కోడెల పంపిణీ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. .అనారోగ్యంతో లేదా బలహీన స్థితిలో ఉన్న కోడెలను చివరి దశలో గోశాలకు తీసుకురావడం వల్ల వాటిని సంరక్షించడం కష్టమవుతుందని తెలిపారు.అత్యంత దయనీయ స్థితిలో ఉన్న కోడెలను గోశాలలో వదిలివెళ్లకుండా,ముందుగా గోశాల నిర్వాహకులను సంప్రదించి అధికారికంగా అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న కోడెలను పలువురు భక్తులు చివరి దశలో తీసుకొచ్చి వదిలివెళ్తున్న పరిస్థితులు ఇటీవల ఆలయ ఈఓ,పశు సంవర్ధక శాఖ అధికారులు గుర్తించినట్లు తెలిపారు. భక్తులు ఆలయ అధికారుల సూచన మేరకు కోడెలను ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు,వైస్ ,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీధర్, తహసీల్దార్ జయంత్ ,కౌన్సిలరుసంవర్ధక శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రుద్రంగిలో దారిని జేసీబీతో ధ్వంసం కేసు నమోదు



**రుద్రంగి సెప్టెంబర్ 15 (జనం సాక్షి)**రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం రుద్రంగి గ్రామానికి చెందిన నంద్యాడపు అంజయ్యకు, రుద్రంగి గ్రామ శివారులోని నాగారం చెరువు వద్దకు వెళ్లే దారిలో రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది.ఆ భూమికి వెళ్లేందుకు రుద్రంగి నుండి నాగారం చెరువు వైపు వెళ్లే దారి గుండా ప్రతిరోజు రాకపోకలు సాగిస్తున్నట్లు బాధితుడు తెలిపారు.అయితే అదే గ్రామానికి చెందిన ధర్నా ఎల్లయ్య అనే వ్యక్తి జేసీబీతో ఆ దారిని ధ్వంసం చేసి ప్రజలు వెళ్లకుండా ఆటంకం కలిగించడంతో పాటు,రోడ్డుకు సంబంధి ంచిన భూమిని తన భూమిలో కలుపుకున్నాడని ఆరోపణ.విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి ప్రశ్నించగా,రోడ్డు స్థలం తనదేనని,అందుకే కలుపుకున్నానని చెప్పి దుర్భాషలాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ మేరకు బాధితుడు నంద్యాడపు అంజయ్య ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం రుద్రంగి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది.సంఘటన స్థలాన్ని మంగళవారం ఎస్సై మోతిరామ్ పరిశీలించి విచారణ చేపట్టారు. ప్రభుత్వ ఆస్తులను ఎవరు ధ్వంసం చేసినా, ఆక్రమించుకోవాలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## మల్లాపూర్ మండలంలో 20 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**మల్లాపూర్:** మల్లాపూర్ మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ చేతుల మీదుగా మండలంలోని 20 మంది లబ్ధిదారులకుసీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగ వారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శ్రీకాంత్, అధికారులు మండల స్థాయి అధికారులు మరియు సర్పంచులు చిట్యాల లక్ష్మణ్, తోట శ్రీనివాస్, జెల్ల రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన ఆదిరెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నగేష్, మాజీ మార్కెట్ చైర్మన్ కాదుర్కా నర్సయ్య, వైస్ చైర్మన్ శరత్ గౌడ్, బి ఆర్ ఎస్ వినాయకులు బైరి రవికుమార్ యాదవ్, నాయకులు రమేష్, సచిన్, లక్ష్మణ్, జైపాల్ రెడ్డి, నరేష్ యాదవ్, ప్రసాద్, రాజు, సురేష్, మహేందర్ తదితరలు బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కల్దుర్కిలో పోషణ మాస మహోత్సవం



**బోధన్, సెప్టెంబర్ 15 ( జనంసాక్షి ) :** బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మన అంగన్వాడి మన బాధ్యత అనే కాన్సెప్ట్ తో పోషకాహారం పట్ల తల్లులకు గర్భిణీలకు అవగాహన కల్పించారు. అనంతరం సామూహిక సీమంతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ జొన్నల నరేందర్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్ గోపి లక్ష్మి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శైహనాజ్ బేగం, అంగన్వాడి టీచర్లు వత్సల, సాయమ్మ, క్రాంతి, సునంద, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, తల్లులు గ్రామస్తులు హాజరైనారు.

# చారిత్రక వినాయకుల బావి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 జనం సాక్షి :నగరంలో వినాయక నిమజ్జన వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజా ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగుతున్నారు. ఇందులో భాగంగానే ఇందూర్ నగరంలోని 45వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ జనహితమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.నిమజ్జన వేడుకలకు వేదికైన స్థానిక వినాయకనగర్‌లోని చారిత్రక 'వినాయకుల బావి'ని ఆమె ప్రత్యేక చొరవతో మంగళవారం శుభ్రం చేయించారు. గణేశ్ మండపాల నుంచి తరలి వచ్చే భక్తులకు నిమజ్జన సమయంలో ఎలాంటి అసౌకర్యాలు తలెత్త కూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.బావి పరిసర ప్రాంతాలతో పాటు, నీటిని శుభ్రపరిచే పనులను ఆమె స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు.పండుగ వాతావరణంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు కల్పిస్తామని, ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని ఈ సందర్భంగా కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ తెలిపారు.నిమజ్జనానికి ముందే బావిని సుందరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దడం పట్ల వినాయకనగర్ వాసులు, యువజన సంఘాల సభ్యులు, భక్తులు కార్పొరేటర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మళ్లీ నిండిన ఎగువ మానేరు



గంభీరావుపేట, సెప్టెంబర్,15 జనం సాక్షి: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని నర్మల ఎగువ మానేరు జలాశయం మళ్లీ నిండుకుండలా మారడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కూడెల్లి, పాల్వంచ వాగులు ఉధృతంగా ప్రవహిస్తూ జలాశయంలోకి భారీగా నీరు చేరుతోంది. దీంతో ఎగువ మానేరు మళ్లీ జలకళను సంతరించుకుని పరవళ్ల తొక్కుతోంది. ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులకు సాగునీటి భరోసా లభించడంతో పంటలకు ఢోకా లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఇంటింటికీ నీటి సరఫరాకు నూతన పైప్‌లైన్ ప్రారంభం



గోదావరిఖని, జనంసాక్షి :రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్ మంగళవారం 38వ డివిజన్ పరిధిలో నూతన పైప్‌లైన్‌ను ప్రారంభించారు.నూతన పైప్‌లైన్‌తో తమ ప్రాంతంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించనుండటంతో స్థానిక మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కు కృతజ్ఞతలు తెలిపారు

# మున్సిపల్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

కామారెడ్డి, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (జనం సాక్షి): కామారెడ్డి పట్టణంలోని వివిధ మున్సిపల్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్కకు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీ వినతిపత్రం సమర్పిం చారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి సీతక్కను కలిసి పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.కామారెడ్డి పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు మురికి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్లు, బీటీ రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయా అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల చొప్పున నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు.అదేవిధంగా పట్టణంలో వర్షపు నీరు, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సీసీ డ్రైన్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రి సీతక్కను కోరారు. సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడవచ్చని వివరించారు. కామారెడ్డి పట్టణ విద్యాభివృద్ధిపైనా వినతిపత్రంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. పట్టణంలో ఇంజనీరింగ్, నర్సింగ్, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్ర మాల అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయిం చాలని కోరారు. విద్యా రంగంలో మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా స్థానిక విద్యార్థులకు ఉన్నత విద్య, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. .విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ విద్యాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించేందుకు సహక రించాలని ప్రభుత్వ సల హాదారు షబ్బీర్ అలీ విజ్ఞప్తి చేశారు. కామా



రెడ్డి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా తీర్చిది ద్దేందుకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక నిధులు కేటాయి ంచాలని కోరారు.పట్టణంలో మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యా రంగాల అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తే కామారెడ్డి పట్టణం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతుందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు పట్టణ సమస్యలపై సమగ్రంగా వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# సింగరేణిని సర్వనాశనం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

గోదావరిఖని, జనంసాక్షి: సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశనం చేస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు పెద్దపల్లి పార్లమెంటు ఇంచార్జ్ బి. సంజయ్ ఆరోపించారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సింగరేణి సంస్థ రోజురోజుకూ క్షీణిస్తోందని ఆయన పేర్కొన్నారు. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై ఏ విధంగా వ్యవహరించిందో, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. ప్రస్తుతం సింగరేణి కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని అన్నారు.గత టీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి సింగరేణి నుంచి రూ.54 వేల కోట్లు తీసుకున్నాయని సంజయ్ ఆరోపించారు. ప్రస్తుతం సింగరేణిలో కొత్త బావి కూడా తీయలేని దుస్థితి నెలకొందని అన్నారు




.కార్మికుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని విమర్శించారు. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీలు సైతం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సింగరేణి సంస్థను కాపాడటంతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, స్వప్నం కోటగిరి పాపయ్య, సంగం రాజు, కోడిపెల్లి రాజయ్య, ఇరికిల్ల కనకయ్య, గుండెబోయిన ఓదెలు, చిటికెల రాజలింగు, ఎస్ మల్లయ్య, కళావతి, నారి తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలి

రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 15 (జనం సాక్షి);చేయూత సామాజిక భద్రత పెన్షన్ల పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా,పారదర్శకంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.చేయూత పెన్షన్లకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పకడ్బందీగా చేపట్టడం ,తదితర అంశాలపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మంగళవారం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..నేటి (బుధవారం) నుంచి ఈ నెల 25 వ తేదీ వరకు పెన్షన్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టడం జరుగుతుందని తెలిపారు .చేయూత పెన్షన్ కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు .అర్హత ఉన్న దరఖాస్తులను స్పష్టంగా గుర్తించడంతో పాటు, అనర్హత ఉన్న దరఖాస్తులకు నిర్దిష్ట కారణాన్ని చేయూత వెరిఫికేషన్ మొబైల్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు .వితంతువులు,ఒంటరి మహిళలు, దివ్యాంగులు (తలసేమియా,సికిల్ సెల్ ,హిమోఫీలియా) గీత కార్మికులు,నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు మొత్తం ఏడు రకాలకు సంబంధించిన దరఖాస్తుదారులు సమర్పించిన పత్రాలు అన్ని నిబంధనల ప్రకారం



ఉన్నాయా లేవా అనే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.వితంతు మహిళల కోసం భర్త మరణ ధ్రువీకరణ పత్రం,ఒంటరి మహిళలు అయితే గ్రామాల్లో 30 ఏండ్ల వయసు,పట్టణాల్లో 35 ఏండ్ల వయసు ఉండాలని స్పష్టం చేశారు.వీరికి సంబంధిత పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు ధృవీకరణ చేయాల్సి ఉంటుందని తెలిపారు.గీత కార్మికులు 50 ఏండ్ల వయసు ఉండాలని,ఎక్సైజ్ శాఖ అధికారుల ధ్రువీకరణ పత్రంతో పాటు,గీత కార్మికుల సొసైటీలో సభ్యులుగా ఉండాలని స్పష్టం చేశారు.నేత కార్మికులు 50 ఏండ్ల వయసు ఉండాలని, హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్ శాఖ వారి గుర్తింపు పత్రం ఉండాలని తెలిపారు. ఫైలేరియా బాధితులు వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ధ్రువీకరణ పత్రం ఉండాలని, డయాలసిస్ బాధితులు ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్న వివరాలు ఉండాలని సూచించారు. దివ్యాంగులకు సదరం శిబిరం ద్వారా మంజూరు అయిన 40 శాతం వైకల్య ధ్రువీకరణ యూడీఐడీ పత్రం,చెవిటి వారికి 51 శాతం వైకల్య ధ్రువీకరణ యూడీఐడీ పత్రం ఉండాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేయూత పెన్షన్ ప్రయోజనం అందేలా పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఇట్టి సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ, ఏడీ హ్యాండ్లూమ్స్ ఎ టెక్స్ టైల్స్ సంతోష్, డీఎంహెచ్ఓ ఏంజెలా ఆల్ఫ్రెడ్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైంది

**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** దశాబ్దాల గిరిజనుల కలను నెరవేర్చిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దే అని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తెలిపారు. మంగళవారం పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మా తాండ మా పరిపాలన అనే విధంగా తాండాలను గ్రామాలుగా ఏర్పాటు చేయడం మొదలుకొని రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలతో పాటు గిరిజనుల అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం మాజీ సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. తాండాలలో ప్రతి ఇంటికి త్రాగునీరు అందించారని, మారుమూల తండాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారని, సిసి డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయించారని తెలిపారు. . సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా ప్రతి తండాలో గిరిజనులు ర్యాలీ నిర్వహించి, కేసీఆర్



మంజూరు చేసి పూర్తీ చేసిన అభివృద్ధి పనుల వద్ద కృతజ్ఞతగా కేసీఆర్ చిత్రపటాన్ని పాలాభిషేకం చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కంటే ముందు చేవెళ్లలో గిరిజనులకు అనేక హామీలు ఇచ్చినా అధికారంలోకి వచ్చి 33 నెలలు అవుతున్న వాటిని అమలు చేయటంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడం తో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

# సుందరగిరి రైతు వేదికలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ రైతు శిక్షణా కార్యక్రమం

**చిగురు మామిడి సెప్టెంబర్ 15(జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలోని రైతువేదికలో రైతులకు 'జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్' పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ చత్రు నాయక్ గారు మాట్లాడుతూ రైతులు అందరూ ప్రకృతి వ్యవసాయం చేసి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రసాయనిక ఎరువులు వాడకుండా పంట పండించి మన ఆరోగ్యాలు కాడుకోవాలని రైతులకు సూచించారు.హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ కంది తిరుపతి రెడ్డి గారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల నేల సారం పెరుగుతుందని సూక్ష్మ జీవులు సేంద్రీయ పదార్థాలు పెరుగుతాయని పేర్కొన్నారు.పాక్స్ చైర్మన్ శ్రీ చిట్టమల్ల రవీందర్ గారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల నేల నీరు గాలి కాలుష్యం తగ్గుతుంది అని ఆర్గానిక్ ఉత్పత్తులకు మంచి మార్కెట్ ధర లభించే అవకాశం ఉందని




అన్నారు.సుందరగిరి గ్రామ సర్పంచ్ శ్రీమతి జంగా శిరీష వెంకటరమణ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల నేల సారం పెరుగుతుంది,రసాయన,ఎరువులు,పురుగుమందు లు వాడకం తగ్గుతుంది,ఆహార నాణ్యత పెరుగు తుంది అని పేర్కొన్నారు.మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ గారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల సాగు ఖర్చులు తగ్గి నెల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణ జరుగుతుంది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో పాక్స్ డైరెక్టర్ శ్రీరామోజు రాజకుమార్,ఉప సర్పంచ్ రాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ గొప్ప భరోసా

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 జనం సాక్షి:**నిజామాబాద్ పట్టణంలోని ఆర్అండ్బీ అతిథి గృహంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ,అనారోగ్యం, ప్రమాదాలు తదితర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప భరోసాగా నిలుస్తోందని అన్నారు. ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలవడం కాంగ్రెస్ ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు.ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, ఆపద సమయంలో వారికి అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే సీఎం ఆర్ఎఫ్ పథకం అనేక కుటుంబాలకు ఉపశమనం కల్పిస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని తెలిపారు.నిజామాబాద్ పట్టణంలోని వివిధ డివిజన్లకు చెందిన 46 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.32 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు షబ్బీర్ అలీ వెల్లడిం చారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి



సహాయ నిధి ద్వారా సహాయం అందేలా తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వ సహాయం మరింత చేరువయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి పారదర్శకంగా అమలవుతోందని షబ్బీర్ అలీ అన్నారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, పైరవీలు, అదనపు ఖర్చులకు తావు లేకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.నిజమైన అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ వంటి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కుటుంబానికి వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని షబ్బీర్ అలీ కోరారు.ఈ కార్యక్రమంలో ఆకుల లలిత, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, జావిద్ అక్రమ్, కరీం, రత్నాకర్, ఫహీం, అరుణ్ ఖాన్, హాఫిజ్ లైక్ ఖాన్, అహ్మద్, నయీమ్ షహరాన్, పాపా ఖాన్, జాఫర్ హుస్సేన్, వహీద్, ముజాహిద్ ఖాన్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు, కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించిన ఎడపల్లి సర్పంచ్



**ఎడపల్లి, సెప్టెంబర్ 15 ( జనంసాక్షి ) :** ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలను గ్రామ సర్పంచ్ కందగట్ల రాంచందర్ తనిఖీ చేశారు. ఈ మేరకు పాఠశాలలో ఆట వస్తువులు చోరి జరిగిన విషయం గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీతతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనశీను తనిఖీ చేసి విద్యార్థులకు భోజనం వడ్డించారు. పాఠశాలకు అవసరమైన సి సి కెమరాలు తన స్వంత నిధులతో ఏర్పాటు చేస్తానని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందగట్ల రాంచందర్, వార్డు సభ్యులు ముస్తాక్, అస్లాం, నాయకులు ఇషాక్, అసద్ తదితరులు ఉన్నారు.

## సమన్వయంతో భూముల రీసర్వే పూర్తి చేయాలి




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 15 (జనం సాక్షి);**జిల్లాలో భూముల రీసర్వేను రెవెన్యూ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సమన్వయంతో పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.భూముల రీసర్వే ప్రక్రియ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే సర్వే చేసిన గ్రామాలకు సంబంధించిన రికార్డులు తహసీల్దార్లకు అందజేయాలని ఆదేశించారు.భూముల వివరాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా సేకరించాలని,రీ సర్వే పూర్తి పారదర్శకతతో చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ శాఖల భూముల వివరాలను సంబంధిత శాఖల అధికారులకు అందజేయాలని తెలిపారు.సర్వే కు సంబంధించిన పూర్తి వివరాలు క్షేత్రస్థాయి, రికార్డులలో పరిశీలించిన తర్వాత మిగతా ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.సర్వే కు సంబంధించిన రోవర్లను అందుబాటులో పెట్టాలని, లైసెన్స్ సర్వేయర్లను నియమించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, ఆయా మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబరు 17 విలీనము విమోచన కాదు

**ఎడపల్లి సెప్టెంబర్ 15 ( జనంసాక్షి ) :** సెప్టెంబర్ 17 విమోచన దినం కాదని విద్రోహ దినమని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్ముల గంగాధర్, పుట్టి నడిపి నాగన్న లు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నైజాం నిరుకుశ రాజ్యంలో భూసంబ్లు దేశముక్కులు జాగిర్లాల్ దార్ నైజాం ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసేవారు వీరు ప్రజల నుంచి ఇష్టం వచ్చినట్లు పన్నులు రూపంలో పీడించి వసూలు చేసేవారు ఈ దోపిడీ అంచవేతకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణ సాయుధ పోరాటం ఫలితంగా సుమారు 3000 గ్రామాల్లో పేద ప్రజలకు 10 లక్షల ఎకరాల భూములను పంచగలిగారు నైజం పరిపాలనలో విపరీతంగా వేటిచాకిరి ఉండేది పార్టీ పోరాట ఫలితంగా నిర్మించగలిగారు ఈ నిజాం పోరాటంలో 5000 మంది అమరులయ్యారు ఈ పోరాటం ఫలితంగా నైజం వైదొలిగారు భూస్వామ్య సమాజం నుంచి పెట్టుబడి దారి సమాజం గా మారింది ముమ్మాటికి సెప్టెంబర్ 17 విద్రోహ దినంగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు. కాషా రవి సిద్ధపుశెట్టి .శ్రీపతి మల్లేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లంతకుంట మండలానికి 27వ సారి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ఇల్లంతకుంట సెప్టెంబర్ 15( జనంసాక్షి )**పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా అండగా నిలుస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.మంగళవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు రూ.25.46 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇల్లంతకుంట మండలానికి ఇప్పటివరకు 27వ సారి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు.ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేద ప్రజల సంక్షేమం, వైద్య సహాయం, సామాజిక భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ముస్కానిపేట సర్పంచ్ కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, ఇల్లంతకుంట సర్పంచ్ ఎం. రాజు, పాక్స్ చైర్మన్ వుట్కూరి వెంకటరమణా రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 15, ( జనం సాక్షి)భారతదేశ ప్రముఖ ఇంజనీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137-ఏ, కరీంనగర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు ముఖ్యంగా హైడ్రాలిక్ ఇంజినీరింగ్ రంగంలో ఆయన చేసిన విశేష కృషితో పాటు హైదరాబాద్‌లో మూసీ నది వరదల నివారణకు అందించిన ఇంజినీరింగ్ పరిష్కారాలను గుర్తు చేశారు. విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని ఇంజినీర్లు సమాజ అభివృద్ధికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు .కార్యక్రమంలో జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్-2 సాగర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ పీఆర్వో పుల్లాల శ్యామ్, ఎల్ఐసీ ఎగ్జిక్యూటివ్ రత్నమాల, సిద్దిపేట డీఎస్పీ సదన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

బోధన్, సెప్టెంబర్ 15 ( జనంసాక్షి ) : వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో సార్వజనిక్ ఆధ్వర్యంలో సోమవారం వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సార్వజనిక్ అధ్యక్షుడు పూజారి లింగం, ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకటనారాయణ కొబ్బరికాయలు కొట్టి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల శ్రేయస్సే సహకార సంఘాల ప్రధాన లక్ష్యం



**జనం సాక్షి । నిజాంసాగర్ । సెప్టెంబర్ 15:**రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని నిజాంసాగర్ మండలం అచ్చంపేట సహకార సంఘం చైర్మన్ కయ్యం నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం అచ్చంపేటలో నిర్వహించిన సహకార సంఘం మహాజన సభలో ఆయన మాట్లాడారు బయట మార్కెట్లలో ఎరువుల కోసం ఇబ్బందులు పడకుండా, సహకార సంఘాల ద్వారా అందుతున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.నూతన భవన నిర్మాణానికి అంగీకారం మహాజన సభలో అచ్చంపేట సహకార సంఘం పరిధిలోని అచ్చంపేట గ్రామంలో నూతన సహకార సంఘ భవనం నిర్మించాలని సభ్యులు కోరారు. ప్రస్తుతం రైతులు, సంఘ సభ్యులకు అందుతున్న సేవలను మరింత సౌకర్యవంతంగా అందించేందుకు నూతన భవనం అవసరమని వారు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. సభ్యుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ కయ్యం నరసింహారెడ్డి నూతన భవన నిర్మాణానికి అంగీకారం తెలిపారు.సహకార సంఘం అభివృద్ధికి సభ్యులు, రైతులు సమష్టిగా సహకరించాలని ఆయన కోరారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించే విధంగా సహకార సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.రైతులకు మరింత చేరువగా సేవలు సహకార సంఘాలు కేవలం ఎరువుల విక్రయాలకే పరిమితం కాకుండా రైతులకు అవసరమైన వివిధ వ్యవసాయ సేవలను అందించేలా మరింత బలోపేతం కావాలని మహాజన సభలో సభ్యులు అభిప్రాయపడ్డారు. రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా సంఘం కార్యకలాపాలను కొనసాగించాలని సూచించారు. అనంతరం సంఘానికి సంబంధించిన పలు అంశాలపై సభ్యులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో అచ్చంపేట సర్పంచ్ సంకు లక్ష్మయ్య, సహకార సంఘం సీఈఓ సంగమేశ్వర్ గౌడ్, సంఘ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే దిక్సూచి



**గంభీరావుపేట సెప్టెంబర్ 15 జనం సాక్షి;**
ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని మండల విద్యాధికారి పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం గంభీరావుపేట మండల వనరుల కేంద్రం (ఎం ఆర్ సి)లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనలో ప్రతిభ, విద్యార్థుల అభ్యున్నతికి చేసిన కృషి, పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం, విద్యారంగానికి అందించిన సేవలను పరిగణనలోకి తీసుకొని మొత్తం 18 మంది ఉపాధ్యాయులను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు.ఎంపికైన ఉపాధ్యాయులను మండల విద్యాధికారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఇతర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ.. ఉత్తమ ఉపాధ్యాయుల సేవలు మిగతా ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన విద్య, పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకుంటూ.. భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతికి మరింత కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

# మోక్షగుండం విశ్వేశ్వరయ్య మార్గంలో మనము నడవాలి



**రామగిరి జనం సాక్షి (సెప్టెంబర్ 15):**ప్రముఖ సివిల్ ఇంజనీర్, భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జిఎం కార్యాలయం నందు మంగళవారం 'ఇంజనీర్స్ డే' నిర్వహించడం జరిగింది. రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (ఎలక్ట్రికల్) హైద్రాబాద్ రీజియన్ కోమల్ చౌదరి, ముఖ్య అతిథులుగా హాజరైసర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించారు.అనంతరం ఏరియాలో సీనియర్ ఇంజనీర్లు అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్ధన్, ఓ.సి -1 ఉపరితల గని నుండి పర్యావరణాధికారి కిషన్, బేస్ వర్క్ షాప్ విభాగాధిపతి జీ.వి సత్యనారాయణ, తోపాటు డిడిఎంఎస్ కోమల్ చౌదరి లను శాలువాతో సత్కరించి సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ మోక్ష గుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలను కొనియాడారు.వారి నిరాడంబరత, భారత జాతి అభివృద్ధికి చూపిన అంకిత భావం వలన వారికి భారతరత్న బిరుదు లభించింది.మన రాష్ట్రం లో మూసి నది వరదల నివారణ ఆయన పనితనమే.ఆటోమేటిక్ వరద గేట్ ల వ్యవస్థ తో బాటు అనేక సివిల్ ఇంజనీర్ పనులే గాక ఆర్థిక పరమైన ఉత్తమ సలహాలను జాతి అభివృద్ధికై అందించారు విశ్వేశ్వరయ్య, గ్రామాలలో అనేక ఆవిష్కరణ లు జరుగుతున్నాయి, వారంతా ఇంజినీర్లే, మనం కూడ జాతి అభివృద్ధి కి మన వంతు పాత్ర నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటుజిఎం యం.రామ్మోహన్, ఏరియా ఇంజనీర్లు ఉదయ్ భాస్కర్, దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్దన్, ఐ ఈ డిజియం బి.టి. మురళీ కృష్ణ, సివిల్ డీజీఎం ఎస్.రవికుమార్, పర్చేస్ అధికారి రాజా రవి చరణ్, ప్రాజెక్ట్ ఇంజినీర్ ప్రకాష్, మేనేజర్లు పాపయ్య, భరత్ కుమార్, ఇతర గనుల, విభాగాల విభాగాదిపతులు, అధికారులు పాల్గొన్నారు

# రామగుండం పునర్నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం



**గోదావరిఖని,జనంసాక్షి:**రామగుండంపునర్నిర్మాణం లో ఇంజనీర్లు పోషిస్తున్న పాత్ర కీలకమని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఇంజనీర్స్ డే పురస్కరించుకొని మంగళ వారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న ఇంజినీర్లను లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం సౌజన్యంతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది శక్తి కి మించి శ్రమిస్తూ అభివృద్ధిలో చురుగ్గా పాలు పంచుకుంటున్నారని ఆయన కొనియాడారు. ప్రస్తుత ఇంజినీర్లు చిత్త శుద్ధితో సేవలందిస్తూ నాణ్యత లో ఏ మాత్రం రాజీ పడకుండా మన్నికగా సుదీర్ఘ కాలం నిలిచి ఉండేలా రోడ్లు , కాలువల నిర్మాణం చేపడుతున్నారని అభిన ందించారు. రామగుండం నగరాన్ని అధ్భుతశీగా తీర్చి దిద్దాలనే స్థానిక ఎం ఎల్ ఎ లక్ష్యానికి అనుగుణంగా ఇదే ఒరవడి కొనసాగిస్తూ ఇంజనీర్లు పని చేసి పాలవర్గానికి మంచి పేరు తీసుకు రావాలని ఆశిస్తున్నామని అన్నారు. అందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతి స్వరూప్ , ఎ ఇ లు మీర్ , తేజస్విని , సౌమ్య , మనోజ్ , అన్వేష్ , నవీన్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు నవీన్ , అశోక్ , కళ్యాణ్ , శ్రావణ్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ సత్కారం అందుకున్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి కజంపురం రాజేందర్ తో పాటు , నగర పాలక సంస్థ కార్పొరేటరు రమేష్, కొలని కవిత , బాలసాని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో అట్టహాసంగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకుల సన్మాన కార్యక్రమం



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 జనం సాక్షి** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ముఖ్య మండల ఇన్‌చార్జిల అత్యవసర సమావేశం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి మాసాయిపేట యాదగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అలాగే జాతీయ కోర్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన యమున మాదిగ, సత్తెక్క మాదిగ, జాతీయ ప్రధాన కార్యదర్శి పద్మ మాదిగ తదితరులను కూడా శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.19న మహిళా జిల్లా కమిటీ ఏర్పాటు ఈ సమావేశంలో రాబోయే కాలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఇందులో భాగంగా 19న ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ మహిళా జిల్లా కమిటీని అధికారికంగా ఏర్పాటు చేయనున్నట్లు నాయకులు ప్రకటించారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి గ్రామం, ప్రతి మండలం నుంచి మహిళలను పెద్ద ఎత్తున సమీకరించి తరలించాలని ముఖ్య మండల ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేశారు.ముఖ్యంగా రాబోయే మహిళా జిల్లా కమిటీ ఏర్పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి ఇన్‌చార్జి దప్పు నర్సయ్య మాదిగ, ఇందల్వాయి ఇన్‌చార్జి సంగెం కిష్టయ్య మాదిగ, నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి యాదాసి శ్రీరాములు మాదిగ, ధర్పల్లి మండల ఇన్‌చార్జి నక్క రాజేందర్ మాదిగ, సిరికొండ మండల ఇన్‌చార్జి దీపక్ మొట్టల మాదిగ తదితరులతోపాటు ఆకారం రమేష్ మాదిగ, ‍దితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహిళా ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట



**కామారెడ్డి, సెప్టెంబర్ 15:** మహిళా ఉద్యోగుల సంక్షేమం, భద్రత, సౌకర్యాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. కామారెడ్డి పట్టణంలో మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం రూ.4.78 కోట్ల వ్యయంతో నిర్మించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ (సఖి నివాస్ సెంటర్)ను మంగళవారం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, రాష్ట్ర మంత్రి సీతక్క, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్ కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. మహిళలు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ముందుకు సాగేందుకు సురక్షితమైన వసతి సదుపాయాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి కామారెడ్డికి వచ్చి ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు ఈ హాస్టల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు సురక్షితమైన వసతి కల్పించడం ద్వారా వారు ఎలాంటి ఆందోళన లేకుండా తమ విధులను నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.మహిళలు విద్య, వైద్యం, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపారం, రాజకీయాలు తదితర అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. మహిళలు సురక్షితంగా ఉన్నప్పుడే తమ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించగలరని, వారికి భద్రత, వసతి, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.కామారెడ్డిలో ప్రారంభించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ మహిళా ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సీతక్క అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబాలు, సమాజం కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మహిళా ఉద్యోగులకు సురక్షిత వసతి: ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్ మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణంలో రూ.4.78 కోట్లతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మించడం అభినందనీయమన్నారు. ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు నాణ్యమైన, సురక్షితమైన వసతి కల్పించేందుకు ఈ హాస్టల్ దోహదపడుతుందని తెలిపారు మహిళా ఉద్యోగులకు అందుబాటులో ఉండే వసతులు, భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు అనుకూలమైన వాతావరణం కల్పించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# దాచారం పాఠశాలకు విద్యార్థుల సేవాభావం




**ఇల్లంతకుంట సెప్టెంబర్ 15(జనంసాక్షి )**మండలంలోని దాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్ట్రీట్ కాస్ ఐఏఆర్ఈ హైదరాబాద్ కళాశాల విద్యార్థులు సేవాభావంతో అండగా నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి ఆధ్వర్యంలో సుమారు రూ.3 లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపట్టారు.గతంలోనూ ఇదే పాఠశాలకు హౌస్ డ్రెస్సులు, పెయింటింగ్, విద్యార్థులకు షూస్ తదితర అవసరాల కోసం రూ.1.80 లక్షల ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రేణుక నాగరాజు, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా దృక్పథం అభినందనీయమని అన్నారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపడుతున్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్ట్రీట్ కాస్ ఐఏఆర్ఈ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వినాయక మండపంలో ప్రత్యేక పూజలు



**రాయికల్ సెప్టెంబర్ జనం సాక్షి:**వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో కెటిఎమ్ రవి ఆధ్వర్యంలో రైడర్స్ యూత్ వారు ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని బీజేపీ రాష్ట్ర నాయకురాలు డా. బోగ శ్రావణి ప్రవీణ్ సందర్శించారు.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రైడర్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆమె ఆకాంక్షించారు. శ్రీ వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో రాయికల్ మండల అధ్యక్షులు ఆకుల మహేష్, జిల్లా ౹౹ మోర్చా అధ్యక్షులు తిరుపతి నాయక్, రాజశేఖర్, మణికంఠ, అర్జున్,నాగరాజు ,రమేష్ మరియు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్న క్షేత్రంలో అన్నదానం



**మల్యాల సెప్టెంబర్ 15 (జనం సాక్షి)**తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో డొక్కా సీతమ్మ స్ఫూర్తితో శ్రీ వాసుదేవా పరివార్ సమితి ఆధ్వర్యంలో జిల్లా హిందూ వాహిని ప్రాంతీయ సంపర్క్ వేముల సంతోష్ అంజన్న దర్శనానికి వచ్చే భక్తులకు ప్రతి మంగళవారం 300కు పైగా భక్తులకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారు.సంతోష్ మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు కొండపైన పూర్తిస్థాయిలో అందరికీ స్వామివారి అన్న ప్రసాదం మరియు భోజన వసతికి సంబంధించి వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని కొంతమంది భక్తులకు ఆకలి తీర్చేందుకు ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని భవిష్యత్తులో స్వామివారి కృపతో నిత్య అన్నదానం నిర్వహించేందుకు తన వంతుగా ప్రయత్నం చేస్తున్న అని తెలిపారు.



గణనాథునికి ఉండ్రాళ్ళ ప్రసాదం అంటే చాలా ప్రియమైనది

## అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా శ్రీ గణనాథునికి 108 రకాల ప్రసాదాల సమర్పణ

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :**
గణనాథుడు అంటే సకల బాధల నుండి విముక్తి కల్పించేవాడని, విఘ్నాలను తొలగించి చక్కని విద్యను అందించేవాడని ఉజ్వలమైన భవిష్యత్తును ప్రసాదించేవాడు గణనాథునని అల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాహకులు డాక్టర్ వి. వనజా నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో శ్రీ విఘ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రెండవ రోజులో భాగంగా శ్రీ మహాగణపతికి సుమారు 108 రకాల ప్రసాదాలతో మహా ప్రసాదం సమర్పణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ కార్యక్రమం చాలా విశిష్టమైనదని, భక్తుల్లో నూతన ఉత్సాహాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం గణనాథునికి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని, గణనాథునికి ఇష్టమైనటువంటి ఉండ్రాళ్ళు, మోధకాలు, గారెలు, పులిహోర, పెరుగన్నం, సిరా, పొంగలి, పాయాసం తదితర ప్రసాదాలను తయారు చేసి, అదేవిధంగా పలు పండ్లు స్వామివారికి నైవేద్యంగా సమర్పించడం జరిగిందని తెలిపారు. ఉత్సవాలలో భాగంగా వివిధ రకాల ప్రసాదాలు గణనాథునికి ఇష్టమైన ఫలహారాలను సమర్పించాలని, ఉత్తమంగా ఎదిగాలని, వేడుకలలో భాగంగా స్వామి వారికి మహాహారతి ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పీజీ సీటు రాలేదనే మనోవేదనతో

## ఎంబిబిస్ డాక్టర్ ఆత్మహత్య



**కరీంనగర్, క్రైమ్ సెప్టెంబర్ 15 ( జనంసాక్షి ) :**
పీజీ సీటు రాలేదనే మనోవేదనతో ఎంబిబిస్ డాక్టర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది., పసుల గౌతమ్ (39)ఎం బి బి స్ కోర్సు పూర్తి చేసి గత నాలుగు సంవత్సరాలుగా కాంట్రాక్ట్ బేసిస్‌పై ధర్మారం మండలంలోని నందిమేడారం మరియు చొప్పదండి మండలంలోని కటికనపల్లి గ్రామాల్లోని పీహెచ్ సి వైద్యుడిగా విధులు నిర్వహించాడు. సుమారు నెల రోజుల క్రితం తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు.గౌతమ్ గతంలో రెండు సార్లు పీజీ ప్రవేశ పరీక్ష రాసి నప్పటికీ, మెరిట్ మార్కులు రాకపోవడంతో పీజీ సీటు లభించలేదు. దీంతో కొంతకాలంగా తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తన తల్లిదండ్రులు సులోచన మొగులయ్య లతో మాట్లాడి బాధపడుతూ తన బెడ్‌రూమ్‌లోకి వెళ్లి నిద్రించాడు. అనంతరం తెల్లవారుజామున 3 గంటల సమయంలో తల్లి లేచి చూడగా గౌతమ్ బెడ్‌రూమ్ లో ఉరివేసుకున్న స్థితిలో కనిపించాడు. తల్లిదండ్రులు వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచి అతడిని కిందకు దించి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గౌతమ్ తండ్రి పసుల రాజమొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తన కుమారుడి మరణంపై ఎవరిపైనా ఎలాంటి అనుమానం లేదని తండ్రి మొగిలయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.మృతుడు గౌతమ్ తండ్రి ఇరిగేషన్ శాఖలో పనిచేసి పదవీ విరమణ పొందారు. గౌతమ్ అన్న బ్యాంక్ మేనేజర్‌గా, చెల్లెలు జగిత్యాలలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం కుటుంబం న్యూ సరస్వతి నగర్, తిగలగుట్టపల్లి ప్రాంతంలో నివసిస్తోంది. ఈ ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

## మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలి

### గుండారం గ్రామ సర్పంచ్ జంగిలి పోచాలు

**కమాన్ పూర్, సెప్టెంబర్ 15, ( జనంసాక్షి):**
రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా గుండారం గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గ్రామ సర్పంచ్ జంగిలి పోచాలు సర్టిఫికెట్లను అందజేశారు. గ్రామ మహిళలు ఆర్థికంగా స్వయం ఉపాధి సాధించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కుట్టు శిక్షణ శిబిరాన్ని మహిళలు విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. మహిళలు కేవలం ఇంటి పనులకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి రంగంలో రాణించాలని ఈ శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలతో సొంతంగా కుట్టు దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సర్పంచ్ పోచాలు పిలుపునిచ్చారు. మహిళలు సొంతంగా కుట్టు మిషన్ షాప్స్ మరియు అనేక రంగాల్లో ముందుకు పోవాలని ప్రభుత్వం వారికి బ్యాంకు నుండి లోన్స్ ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సర్టిఫికెట్ అందుకున్న మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ఎంఈ రజిత, ట్రైనర్స్ పద్మ, రమా పాల్గొని మహిళ సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రతి మహిళ స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగే వరకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.



## గీకురు రవీందర్ కుటుంబానికి అండగా ఉంటాం..

### పరామర్శలో ధైర్యం చెప్పిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



**చిగురుమామిడి సెప్టెంబర్ 15(జనంసాక్షి):**
ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్ చిత్రపటానికి రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి మంగళవారం ఘన నివాళులర్పించారు. చిగురుమామిడి లోని రవీందర్ నివాసానికి వెళ్లిన మంత్రి,ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గీకురు రవీందర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసిన సేవలను కొనియాడారు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, నిబద్ధత కలిగిన నాయకుడిగా ఆయన ఎంతో శ్రమించారని గుర్తు చేసుకున్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటూ, స్థానిక ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ప్రశంసించారు.ఆయన అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి,స్థానిక నియోజకవర్గ ప్రజలకు తీరని లోటని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.రవీందర్ ఆశయాలకు అనుగుణంగా వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వేళలా అండగా నిలుస్తుందని,ఏ కష్టం వచ్చినా ఆదుకుంటుందని మంత్రి ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు గట్టి భరోసా ఇచ్చారు.రవీందర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని,ఈ తీవ్ర శోకంలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మంత్రి ఆకాంక్షించారు. చిన్నముల్కనూరు లో ఇటీవల మృతి చెందిన కొయ్యడ రాజ్ కుమార్ చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందె సురేష్ సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,ప్రజా ప్రతినిధులు,స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు ముఖ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మావోయిస్టు సీనియర్ అండర్ గ్రౌండ్ క్యాడర్ అధినేత లొంగుబాటు

విధానాల వల్ల మావోయిస్ట్ ఉనికి చివరి దశకు చేరిందని, తెలంగాణకు చెందిన ముగ్గురు మినహా అందరూ ప్రధాన స్రవంతిలో చేరారని స్పష్టం చేశారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా వారు కూడా హింసామార్గాన్ని విడనాడి జనజీవన స్రవంతిలోకి రావాలని ఈ సందర్భంగా సీపీ పిలుపునిచ్చారు.

### అనుమానిత వ్యక్తులు కనిపిస్తే

## సమాచారం ఇవ్వాలి

### గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు

**కమాన్ పూర్ సెప్టెంబర్ 15, (జనంసాక్షి) :**
అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే సమాచారం ఇవ్వాలని గోదావరిఖని టూ టౌన్ సిఐ నక్క ప్రసాద్ రావు అన్నారు. మంగళవారం సాయంత్రం పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలంలోని గుండారం గ్రామం సమ్మక్క వాడలో ఎస్సై కోటి ప్రసాద్ ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రసాదరావు హాజరై మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే 112 నెంబర్ కు ఫోన్ చేయాలని సూచించారు. యువత కు ద్విచక్ర వాహనాలు ఇస్తే వారిపై తల్లిదండ్రులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా యువత పెడదారిన పట్టకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులపై ఉందని గంజాయి కి బానిసలు అయితే జీవితం కోల్పోతారని పేర్కొన్నారు. సైబర్ మోసాలపై జాగ్రత్త ఉండాలని ఓటీపీలు ఎవరికి చెప్పకూడదని సూచించారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగే హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగిల్ పోచాలు, ఏఎస్ఐ ఖలీల్ ఖాన్, సిబ్బంది జంగిలి రమేష్, దాసి సతీష్, అంజలి, జాహ్నవి, రమీజ్, శ్రీనాథ్ తోపాటు పలువురు పాల్గొన్నారు.



### బాధిత కుటుంబాన్ని పరామర్శించి

## ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే

**మల్యాల సెప్టెంబర్ 15 (జనంసాక్షి)**
కొడుకుతో శశాంక్ తో పాటు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న మండల కేంద్రానికి చెందిన గుండెటి కవిత కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి 10 వేల రూ ఆర్థిక సహాయం అందజేసి వారికి కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు.ఎమ్మెల్యే వెంట ఎమ్మార్వో శ్రీనివాస్,మండల అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్,యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శనిగరం తిరుపతి,అంజిరెడ్డి, సతీష్ రెడ్డి,వెంకటేష్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



### దాచారం అంగన్వాడి కేంద్రాలను సందర్శించిన

## బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మారవేణి దివ్య

**ఇల్లంతకుంట సెప్టెంబర్ 15(జనంసాక్షి )**
మండలంలోని దాచారం గ్రామంలో ఉన్న రెండు అంగన్వాడి కేంద్రాలను బీజేపీ ఇల్లంతకుంట మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు మారవేణి దివ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న సేవలు, పౌష్టికాహారం, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారం, చిన్నారుల ఆరోగ్యం, ప్రాథమిక విద్య తదితర అంశాలను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, పోషకాహార పథకాలపై సిబ్బంది, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదల, విద్యాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని మారవేణి దివ్య అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా అంగన్వాడి సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం రెండు అంగన్వాడి కేంద్రాల టీచర్లు, ఆయాలను శాలువాలతో సత్కరించి అభినందించారు. చిన్నారుల భవిష్యత్తు కోసం సిబ్బంది చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మొదటి అంగన్వాడి కేంద్రం టీచర్ గౌరవేణి ముత్తవ్వ, రెండో అంగన్వాడి కేంద్రం టీచర్ కోడిముంజా అరుణ, ఆయా నరిగే గౌరవ్వ, అల్వాల భారతి, బర్ల బాబాయి, నరిగె వర్షిణి, అంగన్వాడి సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులపై పీడీ యాక్ట్

- రూ.1.93 కోట్ల విలువైన 387.128 కిలోల గంజాయి స్వాధీనం..
- పనసపండ్ల మాటున తరలిస్తుండగా పట్టుకున్న కామారెడ్డి పోలీసులు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (జనంసాక్షి):**
మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కామారెడ్డి జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా భారీ మొత్తంలో గంజాయిని అక్రమంగా రవాణా చేసిన ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులపై పీడీ యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్) కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు.
పనసపండ్ల మాటున గంజాయి అక్రమ రవాణా
పోలీసుల వివరాల ప్రకారం.. 2026 జూన్ 20న ఒడిశా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు భారీగా గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు దేవునిపల్లి పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి జాతీయ రహదారి-44పై విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు.
ఈ క్రమంలో క్యాసంపల్లి గ్రామ శివారులోని రాయల్ ధాబా సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనం పైభాగంలో పనసపండ్లను ఉంచి, వాటి కింద సంచుల్లో గంజాయిని ఎవరికి అనుమానం రాకుండా తరలిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో మొత్తం 387.128 కిలోల గంజాయి పట్టుబడింది. దీని విలువ సుమారు రూ.1,93,56,400గా పోలీసులు వెల్లడించారు.
ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం దర్యాప్తులో భాగంగా గంజాయి సరఫరా గొలుసు, ముఠాలోని ఇతర సభ్యుల పాత్ర, ఆర్థిక లావాదేవీలపై పోలీసులు దృష్టి సారించారు.



**ఇద్దరు నిందితులపై పీడీ యాక్ట్**
ఈ కేసులో గంజాయి అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరించినట్లు పేర్కొంటున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులపై పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు.
రాజు ఏ రాజ్‌కిషోర్ ప్రధాన్ ? తండ్రి రామ్‌నాథ్ ప్రధాన్, కంధమాల్ జిల్లా, ఒడిశా రాష్ట్రం.
మాదకద్రవ్యాల సరఫరా ద్వారా యువతపై తీవ్ర ప్రభావం చూపే నేర కార్యకలాపాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజా శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు ఇలాంటి నేరాలను అరికట్టేందుకు వీరిపై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు పోలీసులు తెలిపారు.
డ్రగ్ మాఫియాకు అవకాశం ఇవ్వం: ఎస్పీ
జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. కామారెడ్డి జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా, వాహన తనిఖీలు, నాకాబందీలు, ప్రత్యేక ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో పీడీ యాక్ట్‌ను కూడా కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్ మాఫియాకు కామారెడ్డి జిల్లాలో ఎలాంటి అవకాశం ఇవ్వబోమని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, నిల్వలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు, పోలీస్ అధికారులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.



## బదిలీపై వెళ్తున్న మొదటి అదనపు జిల్లాజడ్జి హరీష్‌కు ఘన సన్మానం

**నిజామాబాదు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 జనం సాక్షి :**
నిజామాబాద్‌లో మొదటి అదనపు జిల్లాజడ్జిగా పనిచేసిన న్యాయమూర్తి హరీష్‌ను బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు నీలకంఠరావు ఆధ్వర్యంలో ఈ వీడ్కోలు బదిలీ సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లాజడ్జి జి.వి.ఎన్. భారత లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ మొదట కొంచెం పనిలో కఠినంగా ఉన్నా చివరి కాలంలో అందరి మనసులను పొందారన్నారు. జిల్లాజడ్జి భారత లక్ష్మి మాట్లాడుతూ మా జ్యూడీషియల్ టీంలో ప్రతి ఒక్కరు కలిసి కట్టుకు పనిచేసినామనీ, హరీష్ మేడమ్ తన పనితీరును ప్రొసీజర్ ప్రకారం నిర్వహించినారన్నారు. బదిలీపై వెళ్తున్న మొదటి అదనపు జిల్లాజడ్జి మాట్లాడుతూ తన కోర్టులో నడిచే ప్రొసీడింగ్‌తో సమయం ప్రకారం నిర్వహించుట తెలిసారు. కామారెడ్డి జిల్లా నుండి వచ్చిన పిడిపి కేసులను ఒక త్రోవలో పెట్టాలని సాయంత్రం వరకు పనిచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండవ, మూడవ, నాలువ అదనపు జిల్లాజడ్జిలు నారాయణ, దుర్గప్రసాద్, ఉషాకిరణ్, న్యాయ సేవ సంస్థ కార్యదర్శి నీలిమ, సీనియర్ సివిల్‌జడ్జిలు అజయ్, చైతన్య, రెండవ అదనపు కోర్టు మెజిస్ట్రేట్ శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి సుభాష్‌రెడ్డి, లూస్సిరాణి, ఉపాధ్యక్షులు ఆవుల నారాయణ, బైరగనేక్, అదనపు జిల్లాకోర్టు పి.పి.లు నర్సింహారెడ్డి, దయాకర్‌గౌడ్, న్యాయవాదులు టి.గంగాధర్, హసీం, శ్రీమాన్, లీల్లి, రజిత, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



## చింతకుంట కెనాల్‌లో
# నీరు విడుదల చేయాలి
### నిమజ్జన ఏర్పాట్లకు ఇబ్బందులు లేకుండా చూడాలి: గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 15, ( జనం సాక్షి)
వినాయక విగ్రహాల నిమజ్జనానికి చింతకుంట కెనాల్‌లో నీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి చింతకుంట కెనాల్ వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించారు. ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల లేకపోవడంతో నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. సుమారు 700 నుంచి 800 విగ్రహాలు ఇక్కడ నిమజ్జనం చేసే అవకాశం ఉన్నందున కనీసం 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి అడ్డుకట్ట వేయడం ద్వారా 10 నుంచి 12 అడుగుల మేర నీటిని నిల్వ చేయాలని సూచించారు. ఈ మేరకు ఎస్సారెస్పీ సీఈ సుమతితో ఫోన్‌లో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో నీటిని విడుదల చేస్తే నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. చింతకుంటతో పాటు కొత్తపల్లి, మానకొండూరు నిమజ్జన పాయింట్ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, కార్పొరేటర్ గడ్డి ప్రదీప్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## ఆర్జీ-2లో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు
### సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం: ఏరియా జీఎం తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్

**యైటింక్లైన్ కాలనీ, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):**
భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను సింగరేణి రామగుండం ఏరియా-2లో ఘనంగా నిర్వహించారు. ఆర్జీ-2 ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సమీక్ష సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం శ్రీ తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి జీఎం తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధునిక భారతదేశ నిర్మాణంలో, ముఖ్యంగా సాగునీటి పారుదల, వరద నియంత్రణ, ఆనకట్టల రూపకల్పన తదితర రంగాల్లో విశ్వేశ్వరయ్య అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. యువ ఇంజనీర్లు వినూత్న ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధి, పర్యావరణహిత సాంకేతికతలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.
ఇంజనీర్స్ డే వేడుకల్లో భాగంగా ఏరియా జీఎం తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే ఆర్జీ-2 ఏరియా ఉత్తమ ఇంజనీర్‌గా ఎంపికైన సీఎచ్‌పీ ఇన్‌చార్జి శ్రీ బాలాజీరావును సైతం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెండు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు నిర్వహించారు. ఏరియా ఇంజనీర్ శ్రీ చంద్రశేఖర్ 'లైఫ్ ఆఫ్ సర్ ఎం.వి.' అంశంపై, సీఎచ్‌పీ ఇన్‌చార్జి శ్రీ బాలాజీరావు 'సీఎచ్‌పీ ఇన్నోవేటివ్ మెజర్స్' అంశంపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం శ్రీ సత్యనారాయణ, ఏజీఎం ఐఈడీ శ్రీ చంద్రశేఖర్, ఏరియా ఇంజనీర్ శ్రీ చంద్రశేఖర్, పీఓ శ్రీ ఉదయ్ హరిజన్, అధికార ప్రతినిధి శ్రీ ఎన్. వేణుగోపాల్‌తో పాటు ఇతర శాఖాధిపతులు, ఇంజనీర్లు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీనియర్ ఛాయాచిత్రకారుడు శ్రీనివాసుకు ఛాయాచిత్ర సేవా పురస్కారం

మల్లాపూర్, సెప్టెంబర్ 15(జనం సాక్షి)
మల్లాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ ఛాయాచిత్రకారుడు దురిశెట్టి శ్రీనివాసుకు 'నేను సైతం ఛాయాచిత్ర ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో ఛాయాచిత్ర సేవా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. మంగళవారం ట్రస్ట్ బృందం శ్రీనివాసును ఇంటర్వ్యూ చేసి, ఫోటోగ్రఫీ రంగంలో ఆయన అందించిన సేవలను గుర్తించింది. ఎన్నో ఏళ్లుగా ఛాయాచిత్రకారుడిగా సేవలందిస్తున్న శ్రీనివాసు ప్రస్తుతం నిరుపేద కుటుంబ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. ఆయన పరిస్థితులను తెలుసుకున్న ట్రస్ట్ ప్రతి నెల రూ.1,116 ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తోంది.
ఈ సందర్భంగా శ్రీనివాసు మాట్లాడుతూ.. తనలాంటి సీనియర్ ఫోటోగ్రాఫర్లను గుర్తించి వారి స్థితిగతులను తెలుసుకుని ఆర్థిక సహాయం అందిస్తున్న ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. తన సేవలను గుర్తించి పురస్కారంతో సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి నెల ఆర్థిక సహాయం అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ అధినేత కమ్మరి రామకృష్ణాచారి, బృంద సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ ఛాయాచిత్రకారుల సంక్షేమానికి ట్రస్ట్ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఛాయా చిత్రకారులు మండలోజు శ్రీనివాస చారి, కమ్మరి రామకృష్ణ చారి, ఇరుకుల్ల వీరేశం తదితరులు ఉన్నారు.



# వెయ్యి రోజుల ప్రజాపాలన విజయవంతంగా పూర్తి..

## - సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్..

గోదావరిఖని, జనంసాక్షి: వెయ్యి రోజుల ప్రజాపాలనలో భాగంగా రామగుండం క్యాంప్ కార్యాలయంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపాలనలో భాగంగా రామగుండం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు,



పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమన్వయంతో ముందుకు సాగాలని నాయకులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, నాయకులు, సర్పంచులు, వార్డు మెంబర్లు, డివిజన్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా జాతీయ ఇంజనీర్ల దినోత్సవ వేడుకలు

## విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం: మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (జనం సాక్షి) కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ఇంజనీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. దేశ అభివృద్ధికి, ఇంజనీరింగ్ రంగానికి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన సేవలను చైర్‌పర్సన్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఇంజనీరింగ్ రంగంలో ఆయన చేసిన కృషి, సాంకేతిక నైపుణ్యం, దేశ నిర్మాణానికి అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. పట్టణ అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా తదితర మౌలిక వసతుల కల్పనలో



ఇంజనీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో సమర్థవంతంగా అమలు చేయడంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మాంతారావు, ఏఈ వేణు ప్రసాద్, టీపీఓ దేవరాజు, టీపీఎస్ కావ్య, టీపీబీఓ సాయి కిరణ్, మల్లికార్జున్, మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా

## శ్రీ గణనాథునికి 108 రకాల ప్రసాదాల సమర్పణ & ప్రసాదాలతో మహాప్రసాదం

కొత్తపల్లి సెప్టెంబర్ 15 (జనం సాక్షి) గణనాథునికి ఉండ్రాళ్ళ ప్రసాదం అంటే చాలా ప్రియమైనదివందకు పైగా ప్రసాదాలతో స్వామి వారికి ప్రత్యేకమైన కార్యక్రమంతొమ్మిది రోజులపాటు సందడిగా ఉంటుంది గణనాథుడు అంటే సకల బాధల నుండి విముక్తి కల్పించేవాడని మరియు విఘ్నాలను తొలగించి చక్కని విద్యను అందించేవాఢని ఉజ్వలమైన భవిష్యత్తును ప్రసాదించేవాడు గణనాథునని అల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాహకులు డాక్టర్ వి. వనజానరేందర్ రెడ్డి గారు స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో శ్రీ విఘ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని× రెండో రోజు లో భాగంగా శ్రీ మహాగణపతికి సుమారు 108 రకాల ప్రసాదాలతో మహా ప్రసాదాం సమర్పణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ కార్యక్రమం చాలా విశిష్టమైనదని మరియు భక్తుల్లో నూతన ఉత్సాహాన్ని పెంపొందిస్తుందని వారు చెప్పారు.



అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా గణనాథునికి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని వారు చెప్పారు. గణనాథునికి ఇష్టమైనటువంటి ఉండ్రాళ్ళు, మోధకాలు, గారెలు, పులిహోర, పెరుగన్నం, సిరా, పొంగలి, పాయాసం ఉ తదితర ప్రసాదాలను తయారు చేసి, అదేవిధంగా పలు పండ్లు స్వామివారికి నైవేద్యంగా సమర్పించడం జరిగిందని వారు చెప్పారు. ఉత్సవాలలో భాగంగా వివిధ రకాల ప్రసాదాలుగణనాథునికి ఇష్టమైన ఫలహారాలను సమర్పించాలని మరియు ఉత్తమంగా ఎదిగాలని వారు చెప్పారు. వేడుకలలో భాగంగా స్వామి వారికి మహాహారతి ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# ప్రభుత్వ మెడికల్ కళాశాలలో

# కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు

## నేటి నుంచే దరఖాస్తులు ప్రారంభం

**నిజామాబాదు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 జనం సాక్షి :** నిజామాబాద్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మొత్తం 83 కాంట్రాక్ట్ ప్రాతిపదిక పోస్టుల భర్తీకి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. కృష్ణమోహన్ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నియామకాల్లో భాగంగా 4 ప్రొఫెసర్, 7 అసోసియేట్ ప్రొఫెసర్, 51 అసిస్టెంట్ ప్రొఫెసర్, 15 ట్యూటర్ మరియు 6 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 15 నుంచి సెప్టెంబర్ 19 వరకు పనిదినాల్లో సాయంత్రం 4:00 గంటలలోపు ప్రభుత్వ వైద్య కళాశాల కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సెప్టెంబర్ 22వ తేదీన ఉదయం 10:30 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే ధృవపత్రాల పరిశీలనకు తప్పకుండా హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గడువు తేదీ ముగిసేలోగా నిర్ణీత సమయంలోగా దరఖాస్తులను అందజేయాలని కోరడమైనది. ఖాళీలు మరియు వేతన వివరాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం అభ్యర్థులు కళాశాల అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.



# తాపీ మేస్త్రీలకు శిక్షణ

**రామగిరి, సెప్టెంబర్ 15, (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసీ) ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించి, అనంతరం ఆర్‌పీఎల్ (రికగ్నిషన్ ఆఫ్ ప్రైయర్ లెర్నింగ్) పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి ఆధ్వర్యంలో, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ గోదావరిఖని కేంద్రం సహకారంతో జరిగింది. రామగిరి మండలానికి చెందిన 17 మంది తాపీ మేస్త్రీలు ఈ శిక్షణలో పాల్గొని శిక్షణ పూర్తి చేశారు. ఎన్ఏసీ గోదావరిఖని కేంద్రం ఇన్‌చార్జి బి. సంపత్ ఆధునిక నిర్మాణ పద్ధతులపై మేస్త్రీలకు శిక్షణ అందించారు. గోడల నిర్మాణం, సిమెంట్?ఇసుక సరైన నిష్పత్తి, ప్లాస్టరింగ్ పద్ధతులు, కాంక్రీట్ పనుల్లో నాణ్యత, నిర్మాణ ప్రదేశాల్లో పాటించాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిలువేరు స్వామి మాట్లాడుతూ.. తాపీ మేస్త్రీలు తమ వృత్తిలో ఎంతో అనుభవం, నైపుణ్యం కలిగి ఉన్నారని, వారి నైపుణ్యాలకు అధికారిక గుర్తింపు కల్పించేందుకు ఆర్‌పీఎల్ (రికగ్నిషన్ ఆఫ్ ప్రైయర్ లెర్నింగ్) వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. మేస్త్రీలు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ అనంతరం నిర్వహించిన ఆర్‌పీఎల్ పరీక్షకు 17 మంది తాపీ మేస్త్రీలు హాజరయ్యారు. పరీక్షలో అర్హత సాధించిన వారికి తదుపరి దశలో ధ్రువపత్రాలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# సింగరేణిలో అసలు ఏమి జరుగుతుంది

**- సింగరేణిలో దళిత మహిళల ఉద్యోగులకు రక్షణ లేదా..**

**- అక్షితరాణి ఆత్మహత్యకు కారకులైన మిగతా వారిని అరెస్టు చేయాలి..**

**- అక్షితరాణి ఆత్మహత్యకు కారకులెవరో తెలిసినా పోలీస్ లు ఎందుకు జాప్యం చేస్తున్నారు ?**

**- ఎస్సీ, ఎస్టీ వన్ ఇంక్లైన్ అసోసియేషన్ పిట్ సెక్రెటరీ, ఆర్.టి.ఐ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ జనగామ స్వప్న..**



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణిలో మహిళా కార్మికులకు గాని, దళితులకు గాని, చివరకు అప్రెంటిస్ పేరుతో వచ్చిన భవిష్యత్తు కలిగిన నూతన తరానికి కూడా రక్షణ లేకుండా పోయినటువంటి ఉదాంతం, పరిస్థితి సింగరేణిలోనీ టు ఇంక్లైన్ గనిలో చాలా స్పష్టంగా కనబడుతున్నది. సింగరేణిలో అప్రెంటిస్ కు వచ్చిన బిటెక్ చదువుతున్న అక్షిత రాణి అనే దళిత అమ్మాయిని సింగరేణి ఓర్మెన్ మూలంగా మోసపోయిన ఉదాంతాన్ని జనరల్ మేనేజర్ కు, గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో లేఖ ద్వారా ఫిర్యాదు చేసిన న్యాయం జరగకపోవడంతో చివరకు ఆత్మహత్య దిక్కనుకొని తన తనువు చాలించిందని సింగరేణి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఒకటో గని ఫిట్ సెక్రెటరీ జనగామ స్వప్న తెలిపారు. ఇలాంటి ఉదాంతాలు సింగరేణి వ్యాప్తంగా జరుగుతున్నప్పటికీ కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. అసలు సింగరేణి మహిళా వ్యతిరేక సింగరేణిగా మారుతుందా అనే ప్రశ్న తలెత్తుతున్నది. సింగరేణికి దళిత వ్యతిరేక ముద్ర పడుతున్నప్పటికీ తక్షణ చర్యలు తీసుకోవడంలో సింగరేణి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్న దుస్థితి సింగరేణిలో ఉన్నది. దళిత సంఘాలు ఆందోళన చేస్తే తప్ప న్యాయం జరగని దుస్థితి నెలకొంటున్నదనీ ఆమె పేర్కొన్నారు. అసలు సింగరేణిలో మహిళలపై అనేక రకాలుగా వేధింపులు జరుగు తున్నప్పటికీ వాటిని అరికట్టడంలో సింగరేణి యాజమాన్యం పూర్తిగా వైపల్యం చెందుతున్నదన్నారు. పోరాట సంఘాలు, అధికార సంఘాలు, గుర్తింపు ప్రాతినిధ్య జేబీసీఐ సంఘాలు అని చెప్పుకునే వారు ఒక అమ్మాయి ఆత్మహత్య చేసుకుంటే నోరు మెదపకుండా యాజమాన్య అనుకూల విధానాలు అనుసరించడం నిజంగా దురదృష్టకరం. గుర్తింపు సంఘం ఎఐటియుసి ఆర్జీవన్ బ్రాంచ్ రంగు శీను పంచాయతీ చేసి, అమ్మాయిది తప్పు అని దీనిని తప్పుదోవ పట్టించాడు, తక్షణమే ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం మూలంగా సింగరేణి అధికారుల వేధింపుల మూలంగా ఆత్మహత్య చేసుకున్న అక్షిత రాణి కుటుంబాన్ని ఆదుకోవాలి. ఆత్మహత్యకు కారణమైన, ఆర్జీవన్ జిఎం, మేనేజర్, ఓర్ మెన్, ఎఐటియుసి నాయకులు రంగు శీను,వన్ టౌన్ సిఐ, అధికారులను ఉద్యోగం నుంచి తొలగించి ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ, కేసులు నమోదు చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న వేధింపులపై సింగరేణి ఉద్యోగస్తురాలైన సోదరీమణులు ఒక యుద్ధమే చేయవలసి వస్తున్నది. యాజమాన్యం తక్షణమే మహిళలకు రక్షణ కల్పించే చర్యలు తీసుకోవాలి. మహిళలపై జరుగుతున్న వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నాం. అక్షిత కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం తో పాటు సింగరేణి ఉద్యోగం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారి స్థాయిలో పోస్టులు కూడా వారి కుటుంబానికి కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం.

# చదువుకున్న బడికి రూ.5 కోట్ల కానుక..

## జ్ఞాపకాల ఒడిలో మునిగిపోయిన షబ్బీర్ అలీ

- కామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన..
- తనను తీర్చిదిద్దిన పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు







**కామారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** జీవితంలో ఎంత ఉన్నత శిఖరాలను అధిరోహించినా, తనను తీర్చిదిద్దిన పాఠశాల జ్ఞాపకాలను ఎప్పటికీ మరచిపోలేమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. తాను విద్యనభ్యసించిన పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం ప్రతి పూర్వ విద్యార్థి బాధ్యతగా భావించాలని ఆయన పిలుపునిచ్చారు. చదువు నేర్పిన బడికి రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ప్రత్యేకంగా కృషి చేసినట్లు తెలిపారు.

మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు. పాఠశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమైంది.

**చదువుకున్న పాఠశాలకు తిరిగి వచ్చి భావోద్వేగానికి గురైన షబ్బీర్ అలీ**

మహమ్మద్ అలీ షబ్బీర్ 1971లో విద్యనభ్యసించిన కామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆయన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉంది. రాజకీయ, సామాజిక రంగాల్లో ఎన్నో ఉన్నత బాధ్యతలు నిర్వహించినప్పటికీ, తన బాల్య విద్యాభ్యాసానికి పునాది వేసిన పాఠశాలను ఆయన మరచిపోలేదు. నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు పాఠశాలకు వచ్చిన ఆయన, తన విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నేను చదువుకున్న బడి ఇది. ఈ పాఠశాల నాకు కేవలం ఒక విద్యాలయం కాదు.. నా జీవితానికి పునాది వేసిన ప్రదేశం. ఇక్కడి నుంచే నా ప్రయాణం ప్రారంభమైంది. అందుకే ఈ బడికి ఏదైనా మంచి చేయాలనే తపన ఎప్పటి నుంచో ఉంది" అని భావోద్వేగంగా పేర్కొన్నారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, తనతో కలిసి చదువుకున్న మిత్రులను, పాఠశాలతో ముడిపడిన మధుర జ్ఞాపకాలను ఎప్పటికీ మరచిపోలేనని తెలిపారు. ఎన్నో సంవత్సరాల తర్వాత అదే పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రస్తుత విద్యార్థులను కలుసుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. తాను చదువుకున్న తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం తన జీవితంలో మరపురాని జ్ఞాపకాలను మిగిల్చాయని చెప్పారు.

"భవనం మారుతుంది.. కానీ ఈ బడి నాకు ఇచ్చిన జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ మారవు" అని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. విద్యార్థులు తమ పాఠశాల పట్ల గౌరవం, కృతజ్ఞతాభావం కలిగి ఉండాలని సూచించారు.

**పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు**

కామారెడ్డి బాయ్స్ స్కూల్ అభివృద్ధికి అవసరమైన నిధుల విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ప్రత్యేకంగా కృషి చేసినట్లు షబ్బీర్ అలీ తెలిపారు. పాత భవనం స్థానంలో ఆధునిక ప్రమాణాలతో నూతన పాఠశాల భవనాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు.

నూతన భవనం నిర్మాణం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, పాఠశాల మౌలిక వసతులను బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. నేటి విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలిపారు.

నూతన పాఠశాల భవనంలో ఆధునిక తరగతి గదులు, డిజిటల్ విద్యా సౌకర్యాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ప్రయోగశాలలు, విద్యార్థులకు అవసరమైన ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు షబ్బీర్ అలీ వివరించారు. ప్రభుత్వ నిధులతో పాటు, పాఠశాల అభివృద్ధికి అవసరమైన చోట తన వంతు సహకారం కూడా అందిస్తానని స్పష్టం చేశారు.

పాఠశాల అభివృద్ధి కేవలం భవన నిర్మాణంతోనే పూర్తికాదని, విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, మంచి విలువలు అందించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి**

ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని షబ్బీర్ అలీ ఆకాంక్షించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, తమ కుటుంబాలకు, పాఠశాలకు, సమాజానికి పేరు తీసుకురావాలని సూచించారు.

తమకు విద్యనందించిన పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో తాము సహకరించాలనే ఆలోచన విద్యార్థుల్లో పెంపొందాలని అన్నారు. చదువు నేర్పిన బడికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారని, ఆ రుణాన్ని పూర్తిగా తీర్చలేకపోయినా తమకు చేతనైనంత మంచి చేయడం ప్రతి పూర్వ విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు.

**షబ్బీర్ అలీ కృషిని అభినందించిన మంత్రి సీతక్క**

ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఒక వ్యక్తి తాను చదువుకున్న పాఠశాలను గుర్తుంచుకుని, దాని అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కామారెడ్డి బాయ్స్ స్కూల్‌కు రూ.5 కోట్ల నిధులు తీసుకురావడంలో షబ్బీర్ అలీ ప్రత్యేక శ్రద్ధ చూపడం ప్రశంసనీయమని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సీతక్క పేర్కొన్నారు. నూతన భవన నిర్మాణం పూర్తయిన తర్వాత పాఠశాల మరింత మెరుగైన విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అందుబాటులోకి రానున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

**పాఠశాల అభివృద్ధి స్ఫూర్తిదాయకం: ఎంపీ షెట్కర్**

జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్ మాట్లాడుతూ, తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి షబ్బీర్ అలీ చూపుతున్న శ్రద్ధ స్ఫూర్తిదాయకమన్నారు. పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించడమే కాకుండా, విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పించాలనే ఆలోచనతో ముందుకు సాగడం అభినందనీయమని తెలిపారు.

విద్యార్థులు పాఠశాలలో అందుబాటులోకి రానున్న ఆధునిక వసతులను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎంపీ ఆకాంక్షించారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తమ జీవితాల్లో విజయాలు సాధించాలని సూచించారు.

**నూతన భవనంతో మెరుగైన విద్యా వాతావరణం: ఎమ్మెల్యే**

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ, కామారెడ్డి బాయ్స్ స్కూల్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగడం సంతోషకరమన్నారు. పాత భవనం స్థానంలో ఆధునిక వసతులతో కొత్త భవనం నిర్మించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి షబ్బీర్ అలీ చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని అన్నారు.

**పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ అభినందనీయం: కలెక్టర్**

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, కామారెడ్డి బాయ్స్ స్కూల్‌కు నూతన భవనం నిర్మించడం ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన, ఆధునిక విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని అన్నారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కృషిని అభినందించారు.

నూతన భవన నిర్మాణం ద్వారా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపడతాయని, పాఠశాల అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

**బడిని మరచిపోని బిడ్డగా షబ్బీర్ అలీకి ప్రశంసలు**

తాను చదువుకున్న పాఠశాలను మరచిపోకుండా, అదే పాఠశాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు తీసుకురావడంతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్న షబ్బీర్ అలీపై పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు వ్యక్తం చేశారు. జీవితంలో ఎంత ఎదిగినా తనకు విద్యనందించిన పాఠశాలను గుర్తుంచుకుని, భవిష్యత్ తరాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఆలోచన గొప్ప మనసుకు నిదర్శనమని పలువురు కొనియాడారు. చదువు ఇచ్చిన బడికి రుణం తీర్చుకోవాలనే భావన ప్రతి పూర్వ విద్యార్థికి స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. కామారెడ్డి బాయ్స్ స్కూల్ నూతన భవన నిర్మాణం పూర్తయిన అనంతరం విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని, పాఠశాల విద్యా ప్రమాణాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తమైంది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### గణనాథుని శోభతో నిజామాబాద్‌లో

# వైభవంగా వినాయక నవరాత్రులు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** "ఏకదంతాయ వక్రతుండాయ గౌరీ తనయాయ ధీమహే" అనే మంత్రోచ్చారణలు, భక్తిభావనలతో నిజామా బాద్ ఉమ్మడి జిల్లాలో వినాయక నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభ మయ్యాయి. ప్రజలు ఎంతో పవిత్రంగా భావించే ఈ వేడుకల్లో భాగంగా, వాడవాడలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ప్రత్యేక మండపాల్లో బొజ్జ గణపయ్య ప్రతిమలు కొలువుదీరి తొలి పూజలందుకున్నాయి. "గజానన్ మహారాజ్ కీ జై", "శరణు శరణు లంబోదర" అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో నగరమంతా మార్మోగింది.

**ఘనంగా విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం:**

సోమవారం ఉదయం నుంచే నగరంలో విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమాలు కోలాహలంగా కొనసాగాయి. వేలాది సంఖ్యలో విగ్రహాలను మేళతాళాలు, బాజాభజంత్రీలు, డప్పు చప్పుళ్ల నడుమ ఆయా మండపాలకు ఊరేగింపుగా తరలించారు. కొన్ని ప్రాంతాల్లో యువకులు ఒకే రకమైన దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, నిర్వాహకులు సుందరంగా అలంకరించిన గద్దెలపై గణపతి ప్రతిమలను ప్రతిష్టించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ ప్రతిష్టా పర్వం కనులపండువగా సాగింది.

**ఆలయాల్లో ప్రత్యేక పూజలు – దీక్షల స్వీకరణ:**

నగరంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రముఖ గణపతి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణతో పాటు విశేష పూజలు నిర్వహించారు. పశుపతి శర్మ తదితర అర్చకుల ఆధ్వర్యంలో భక్తులు సామూహికంగా వినాయక వ్రతాలు ఆచరించారు. మరోవైపు, నవరాత్రులను పురస్కరించుకుని భక్తులు గణపతి మాలాధారణ దీక్షలను ప్రారంభించారు. ఉదయాన్నే ఆలయాలకు చేరుకున్న భక్తులు కఠిన నియమాలతో 11 రోజుల దీక్షను భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో



ఉచితంగా వినాయక విగ్రహాలను పంపిణీ చేయగా, ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాలుపంచుకోవడంతో ఉత్సవ వాతావరణం సంతరించుకుంది.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



**వేములవాడ రూరల్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** మద్యం అలవాటుకు బానిసై ఒక యువకుడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేములవాడ రూరల్ మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మర్రిపల్లి గ్రామానికి చెందిన గొర్రె అవినాష్ (22), తండ్రి శంకరయ్య, తన కుల వృత్తియైన బైండ్ల పని చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే, పని ద్వారా వచ్చే డబ్బుతో నిత్యం మద్యం సేవిస్తూ, డబ్బులను వృథాగా ఖర్చు చేసేవాడు. ఈ విషయమై తల్లిదండ్రులు పలుమార్లు మందలించినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు.ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా అవినాష్ తీవ్రంగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అనంతరం మద్యం మత్తులో ఇంట్లోని ఫ్యాన్‌కు లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

## చెక్కపల్లి ఉన్నత పాఠశాలలో ఘనంగా 'హిందీ దివస్'

**-జాతీయ సమైక్యతకు హిందీ భాష ప్రతీక: హెచ్‌ఎం లోకిని కిషన్**



**వేములవాడ రూరల్ , సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెక్కపల్లిలో 'హిందీ దివస్' వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా "ఏక్ పేడ్ హిందీ దివస్ కే నామ్" పేరిట మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకిని కిషన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమాన్ని హిందీ పండితులు రేపాక రవి సమన్వయం చేశారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం లోకిని కిషన్ మాట్లాడుతూ... విభిన్న సంస్కృతులు గల మన దేశంలో ప్రజలను ఏకం చేయడంలో హిందీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విద్యార్థులు మాతృభాషతో పాటు హిందీ నేర్చుకుంటే దేశవ్యాప్తంగా ఉన్నత అవకాశాలు లభిస్తాయని చెప్పారు.హిందీ ఉపాధ్యాయులు రేపాక రవి మాట్లాడుతూ... 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగ సభ హిందీని అధికార భాషగా గుర్తించిందని గుర్తుచేశారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, టి ఎల్ ఎం ప్రదర్శన, దేశభక్తి గీతాలాపన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, నీరజ, సంతోష్, రాజు, అజయ్, సురేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదాపూర్ లో కొమ్మెర ధర్మారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యే కవ్వంపల్లి

**గన్నేరువరం, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మెర రవీందర్ రెడ్డి తండ్రి కొమ్మెర ధర్మారెడ్డి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ తోకలిసి మంగళవారం మాదాపూర్ లోని వారి నివాసానికి వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన ధర్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రవీందర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ధర్మారెడ్డి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ,వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కు ఉపేందర్ రెడ్డి,గన్నేరువరం సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కటకం తిరుపతి,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, మహిళా అధ్యక్షురాలు జెల్లా రాజేశ్వరి,మండల నాయకులు మార్గం మల్లేశం, గన్నేరువరం చాకలివానిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి,కూన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

**- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు**

**- సెప్టెంబర్ 17న నిర్వహించనున్న వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు**



**పెద్దపల్లి,సెప్టెంబర్ 15(జనంసాక్షి) :** జిల్లాలో సెప్టెంబర్ 17న నిర్వహించనున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు ఘనంగా, పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ సెప్టెంబర్ 17న నిర్వహించనున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, ప్రోటోకాల్ ప్రకారం ఘనంగా నిర్వహించాలని తెలిపారు. వేడుకలు నిర్వహించే ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వేదిక, డయాస్, సీటింగ్, బ్యారికేడింగ్, విద్యుత్ సరఫరా తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అన్నారు.ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు,అధికారులు, ప్రముఖులు,ఆహ్వానితులకు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు.వేడుకల ప్రాంగణంలో త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, అత్యవసర సేవలకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. వైద్య బృందాలను అందుబాటులో ఉంచడంతో పాటు అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ప్రోటోకాల్ ప్రకారం సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులకు సకాలంలో అందించాలని అన్నారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాల వివరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత శాఖలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ముఖ్య అతిథి ప్రసంగానికి అవసరమైన ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను సకాలంలో అందించాలని అన్నారు.వేడుకల సందర్భంగా శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, బందోబస్తు తదితర ఏర్పాట్లను పోలీస్ శాఖ పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, చివరి నిమిషంలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను ముందుగానే పరిశీలించి పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, సంబంధిత జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం శిబిరం

**- జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద**



**పెద్దపల్లి,సెప్టెంబర్ 15(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల (సిడబ్ల్యుఎస్ఎన్) కోసం సెప్టెంబర్ 18న ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని అమర్‌నగర్‌లో గల సిరి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9.30 గంటలకు శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.అవసరమైన విద్యార్థులు తమ తల్లిదండ్రులు, సహాయకులతో కలిసి తప్పనిసరిగా శిబిరానికి హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి సూచించారు. శిబిరానికి హాజరయ్యే విద్యార్థులు వికలాంగత స్పష్టంగా కనిపించే రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన వికలాంగుల ధ్రువపత్రాన్ని తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. వికలాంగుల ధ్రువపత్రంలో 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వికలాంగత ఉన్నట్లు నమోదు అయి ఉండాలని పేర్కొన్నారు.వికలాంగత ధ్రువపత్రం లేని విద్యార్థులు ప్రభుత్వ వైద్యుడు జారీ చేసిన సర్టిఫికెట్‌ను సంబంధిత ప్రధానోపాధ్యాయుడు, సంబంధిత మండల విద్యాధికారి ధ్రువీకరించి తీసుకురావచ్చని, అదేవిధంగా ఆదాయ ధ్రువపత్రం,రేషన్ కార్డును తీసుకురావాలని సూచించారు.రేషన్ కార్డులోనే ఆదాయ వివరాలు నమోదై ఉంటే ప్రత్యేకంగా ఆదాయ ధ్రువపత్రం అవసరం లేదని స్పష్టం చేశారు.విద్యార్థులు ఆధార్ కార్డును కూడా తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు,వారి తల్లిదండ్రులు సెప్టెంబర్ 18న ఉదయం 9.30 గంటలకు అమర్‌నగర్‌లోని సిరి ఫంక్షన్ హాల్‌కు హాజరై శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## బాధిత కుటుంబాలకు రూ. ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**బోయినపల్లి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ధైర్యం చెప్పారు. బోయినపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు.ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తాళ్లపల్లి లత, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్న నలిమెల మహేందర్ కుటుంబాలను ఎమ్మెల్యే స్వయంగా సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పరంగా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని నిరుపేద, బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని, భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో బోయినపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మనబోయిన సుధీన్ యాదవ్, ఏఎంసీ ఛైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సెస్ డైరెక్టర్ కోటిపల్లి సుధాకర్, సర్పంచులు నల్ల మోహన్, నాయకులు రమణ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు సతీష్, రమేష్, నగేష్, ఎమిరెడ్డి సురేందర్ రెడ్డి, సాంబ లచ్చయ్య, ముచ్చ శేఖర్ రెడ్డి, చంద్రయ్య, గంగయ్య, ప్రవీణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## భాకం సాయికిరణ్ మరో ముందడుగు!!!

**– యువత కోసం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్!!!**

**– సొంత ఖర్చులతో నిర్వహణ!!!**

**– ఈనెల 25 కు చివరి రిజిస్ట్రేషన్!!!**




**సుల్తానాబాద్,సెప్టెంబర్ 15(జనంసాక్షి) :** యువత కోసం ఆరవవార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ మరో ముందడుగు వేసి యువతను ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యారు.సుల్తానాబాద్ లో భాగం సాయి కిరణ్ తన స్వంత ఖర్చులతో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్స్ సీజన్-2 పేరుతో నిర్వహించడానికి సిద్ధమయ్యారు.ఈనెల 25 వరకు యువ క్రికెటర్లు తమ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని నిర్వాహకులు దేశెట్టి సందీప్ తెలిపారు.వివరాల కోసం 9949495850. సంప్రదించాలని కోరారు.

## మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 15, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బావికాడి రామచంద్రం మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సందర్భంగా దుమాల గ్రామ సర్పంచ్, పాలకవర్గం, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించడం జరిగింది. గ్రామ సర్పంచ్ సోమారపు శరవింద్ మాట్లాడుతూ మన పాఠశాలను మండల, జిల్లా స్థాయిలో నిలిపినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందంను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిని చూసి నాకు అవార్డు రావడం జరిగిందని, పాఠశాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. తనను సత్కరించిన గ్రామ సర్పంచ్, పాలకవర్గం, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుర్రం విశాల్, వార్డు సభ్యులు అంకం శ్రీను, రేండ్ల రవి, గ్రామ పెద్దలు కదిరె వెంకటస్వామి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

